Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 24.01.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 34 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

# గడువిచ్చినా గండమే!

**ఎవరి ప్లాన్‌లు వారివి... ఎవరి స్టాండ్‌లు వారివి... విభజన తొందర ఒకరిది... సాగతీతపై ఆశ మరొకరిది. అసెంబ్లీలో చర్చ ముగిసి విభజన బిల్లు పార్లమెంటుకుపోతే, అక్కడ కాంగ్రెస్, బీజేపీల మద్దతుతో ఆ బిల్లు ఆమోదం పొందితే సొంత రాష్ట్రం కల నెరవేరుతుందనేది తెలంగాణ నేతల ఆశ. అసెంబ్లీలో ఈ బిల్లుపై చర్చను సాధ్యమైనంతవరకు సాగతీస్తే, పార్లమెంటులో బిల్లుపై చర్చ జరిగే సమయంలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే విభజన బిల్లు అటకెక్కుతుందని సీమాంధ్రుల ఆశ.**

విభజన బిల్లును వీలయినంత కాలం సాగదీయాలనే లక్ష్యంగా బిల్లుపై చర్చకు రాష్ట్ర ప్రభుత్వం మరో 4వారాల గడువును కోరడం, రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆ విజ్ఞప్తిని తిరస్కరిస్తే లేనిపోని తలనొప్పులొస్తాయని భావించి ఓ వారంరోజుల గడువు పొడిగించడం జరిగింది. విభజన బిల్లుపై చర్చకు గతంలో రాష్ట్రపతి నాలుగు వారాల గడువు ఇచ్చారు. 23వ తేదీతో ఆ గడువు ముగిసింది. శాసనసభలోగాని శాసనమండలిలోగాని కేవలం కొద్దిమంది సభ్యులు మాత్రమే బిల్లుపై మాట్లాడారు. ఎక్కువశాతం మంది సభ్యులు ఇంకా మాట్లాడాల్సివుంది. ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేతల ప్రసంగాలకే రెండురోజుల సమయం కావాల్సి వచ్చేటట్లుంది. అలాంటప్పుడు రాష్ట్రపతి ఇచ్చిన వారం గడువు ఏం సరిపోతుంది. అయితే ఇంకోటి... ఒక వారం కాదు, వందవారాల గడువు ఇచ్చినా శాసన సభలో, మండలిలో బిల్లుపై చర్చను మాత్రం సంపూర్ణంగా పూర్తి చేయలేరు.

అసెంబ్లీ అభిప్రాయాన్ని కూడా కేంద్రం పెద్దగా పరిగణనలోకి తీసుకోవడం లేదు కాబట్టి ఇక్కడ సభ్యుల పాత్ర నామ మాత్రంగానే (మిగతా 10వ పేజీలో)

శుభాకాంక్షలు
పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
గణతంత్రదినోత్సవ శుభాకాంక్షలు. - సం/-

# బిల్లుకు బీజేపీ చిల్లు


- సవరణల కోసం పట్టుతో కాలయాపన

**రాజకీయాలలో తాడిని తన్నే వాడొకడుంటే వాడి తలను తన్నేవాడు మరొకడుంటాడు. నేటితరం రాజకీయ నాయకులంతా ఒకే యూనివర్శిటీలో చదివినవాళ్లే. ఎత్తులకుపైఎత్తులు వేయడంలో ఒకరికొకరు మించిపోయేవాళ్లే.**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనతో సీమాంధ్రలో జగన్ పార్టీ ద్వారా తెలంగాణలో టీఆర్ఎస్ ద్వారా మొత్తం ఎంపీ సీట్లను రాబట్టుకోవాలనుకుంది కాంగ్రెస్ పార్టీ. అందుకే నాలుగున్నర సంవత్సరాలు తెలంగాణ అంశం జోలికే పోకుండా, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలంగాణ చిచ్చుపెట్టింది. రాష్ట్ర విభజన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందితే కాంగ్రెస్‌కు సీట్ల రూపంలో ఎంతోకొంత లాభమే. అదే విభజన జరక్కపోతే రాష్ట్రం మొత్తంమీద కూడా ఎక్కడా ఒక్క సీటొచ్చే పరిస్థితి లేదు. కాంగ్రెస్‌కు ఇప్పుడు ఇదే పరిస్థితి తీసుకురావాలంటే, ఆ పని బీజేపీ చేయగలదు. సీమాంధ్ర సమస్యల పరిష్కారానికి పార్లమెంటులో బీజేపీ పట్టుబడితే, సవరణలు ఆమోదించాల్సిందేనని భీష్మిస్తే బిల్లుకు బ్రేకు పడుతుంది. పార్లమెంటులో వాదోపవాదాలతోనే పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది. ఈలోపు సార్వత్రిక ఎన్నికలు తరుముకొచ్చి రాష్ట్ర విభజన అంశం అటకెక్కుతుంది. సమైక్యరాష్ట్రంలోనే ఎన్నికలు జరుగుతాయి. రాష్ట్ర విభజన జరిగినా, జరగకపోయినా సీమాంధ్రలో కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోతుంది. విభజన ఆగిపోతే కాంగ్రెస్‌కు తెలంగాణలోనూ అదే పరిస్థితి వస్తుంది. అప్పుడు సీమాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్, తెలంగాణలో టీఆర్ఎస్‌లు మెజార్టీ సీట్లు సాధిస్తాయి. కేంద్రంలో బీజేపీ అధికారానికి చేరువయ్యే పరిస్థితులుంటే ఈ రెండు పార్టీలు కూడా ఆ పార్టీకి (మిగతా 10వ పేజీలో)

## భువి నుండి దివికేగిన నట 'నక్షత్రం'





## బహుదూరాలకు... "బాటసారి"

ఓ మహానట వటవృక్షం నేలకొరిగింది. మహోన్నత నటశిఖరం నేలకూలింది. ఉత్తుంగ తరంగమై ఎగసి, మురిపించి, మరిపించిన నటకెరటం కుప్పకూలింది. నటనకు భాష్యం చెప్పిన మహానటుడాయన అనన్య సామాన్య నటనతో తెలుగువారి గుండెల్లో గూడుకట్టుకొన్న ధీరోదాత్తనాయకుడాయన. ఆయనే నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు. తెలుగుతెర ఇలవేలుపుగా భాసిల్లిన నటవిశ్వవిద్యాలయం ఆయన. అక్కినేని మహాభినిష్క్రమణంతో తెలుగు కళామతల్లి నివ్వెరపోయింది. కేన్సర్ కాటేయడంతో 90సం॥ల వయసులో జనవరి 22రాత్రి నిద్రలోనే సెలవంటూ వెళ్ళిపోయారు. అశేష జనవాహిని గుండెలు మూగబోయాయి. భారతదేశం మహానటుణ్ణి కోల్పోయి ఉలిక్కిపడింది. (మిగతా 10వ పేజీలో)

## • నగరపాలక సంస్థ - 4

### నిర్మాణాల ద్వారా రాబడి...

# మార్టిగేజ్ పేరుతో దోపిడి

**కమీషనర్ నుండి టౌన్‌ప్లానింగ్ సూపర్ వైజర్ల వరకూ భవన నిర్మాతల దగ్గర దోపిడీ చేస్తున్నారు.**

**ప్రతి ఫైలుకీ ఓ రేటు. ప్రతి అడుగుకీ ఓ రేటు. ప్రతి అంతస్తుకీ ఓ రేటు. ఇలా నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అన్నింటికీ రేట్లే.**

పంచలింగాలు ఐదు. అష్టలక్ష్ములంటే 8మంది. విష్ణుమూర్తి అవతారాలు పది. జ్యోతిర్లింగాలు పన్నెండు. శక్తిపీఠాలు 18.. ఒక్కో దేవుడికి ఎన్ని రూపాలనే దానిపై కరెక్ట్ లెక్క ఉంది. కాని అవినీతి అనే వికృత రాకాసికి వేలవేల రూపాలు. ఈ సమాజంలో గాలి, వెలుతురు చొరబడని ప్రదేశమైనా లేదేమోగాని అవినీతి జొరబడని ప్రదేశాన్ని ఎవరూ చూపలేరు.

ప్రభుత్వశాఖలలో నీతివంతమైన పనిని చూడడం నేతిబీరకాయలో నేతిని వెదకడమే. కొన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి ఉన్నా కనీసం అందుకు తగ్గట్లు పనన్నా చేస్తాయి. కాని నెల్లూరు నగరపాలక సంస్థ మాత్రం (మిగతా 3వ పేజీలో)



# రాజ్యయోగం ఉందా?

**రాజ్యసభ పదవులు... ప్రధాన రాజకీయ పక్షాలకు ఈ పదవులే ఇప్పుడు కల్పతరువులు, కామధేనువులు. ఒక్కో రాజ్యసభ సీటు ఖరీదు 50 నుండి 200 కోట్లు దాకా పలుకుతుంది. ఒక్క రాజ్యసభ సీటుకు వచ్చే రాబడితో ఒక జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను నడపొచ్చు. అంతటి విలువున్న రాజ్యసభ సీట్లను ఎవరికన్నా ఉచితంగా ఇస్తారా?**

త్వరలో రాజ్యసభకు రాష్ట్రం నుండి ఆరుగురు సభ్యులను ఎన్నుకోవాల్సి వుంది. వీటిలో తెలుగుదేశం పార్టీకి ఖాయంగా రెండుసీట్లు దక్కుతాయి. చంద్రబాబుది రెండు కళ్ళ సిద్ధాంతం కాబట్టి తెలంగాణకు ఒక సీటు, సీమాంధ్రకు ఒక సీటు ఇవ్వొచ్చు. ప్రస్తుతం ఎన్నికల సీజన్. ఖర్చు ఎక్కువుగా ఉంటుంది. పార్టీ చూస్తే, పదేళ్ళుగా అధికారంలో లేదు. నాయకులు, కార్యకర్తలు ఒట్టిపోయిన ఆవుల్లా వున్నారు. సొంత ఖర్చు పెట్టుకుని పోటీచేసే అభ్యర్థులు చాలా తక్కువ. ఎక్కువ నియోజకవర్గాలలో అభ్యర్థులకు పార్టీపరంగా ఆర్థిక సహకారం అందించాల్సి ఉంటుంది. కాబట్టి ఇప్పుడొచ్చిన రాజ్యసభ సీట్లను డబ్బులు ఖర్చుపెట్టగలవారికే ఇవ్వాలి. ఇప్పుడు అలా డబ్బులు ఖర్చుపెట్టుకునే వాళ్లకే ఇస్తారా? లేక పార్టీ కోసం పని చేసిన వాళ్లకిస్తారా అనేది ప్రశ్నగా మారింది. గతంలో సుజనాచౌదరి, సిఎం రమేష్ వంటి పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు రాజ్యసభ పదవులిచ్చారు. పార్టీ కోసం వాళ్లు పెద్ద మొత్తాలలోనే ఖర్చుచేసి వున్నారు. అయితే వారికి ఆ పదవులు ఇచ్చినప్పుడు పలురకాలుగా విమర్శలు వచ్చాయి. ఈసారి పార్టీ కోసం పనిచేసినవాళ్లకు రాజ్యసభ ఇవ్వాలనుకుంటే ఆ కోణంలో నెల్లూరుజిల్లాకు చెందిన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేరు వినిపిస్తుంది. పార్టీ పరంగా రాజ్యసభ ఇవ్వాలనుకుంటే అన్ని విధాలా అర్హుడు సోమిరెడ్డి. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా, మంత్రిగా తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించాడు. పార్టీ ప్రతిపక్షంలో వున్న ఈ పదేళ్ల కాలంలో రాష్ట్ర రాజకీయాలలో ఎన్నో మార్పులు సంభవించాయి. పెద్దపెద్ద నాయకులెందరో పార్టీని వీడిపోయారు. కాని సోమిరెడ్డి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా పార్టీని వీడలేదు. సర్వేపల్లి నుండి రెండుసార్లు, కోవూరు ఉపఎన్నికల్లో ఒకసారి వరుసగా ఓడిపోయి ఆర్థికంగా నష్టపోయినా ఆత్మవిశ్వాసాన్ని వీడలేదు. మొన్నటివరకు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, ప్రస్తుతం పొలిట్‌బ్యూరో సభ్యులుగా జిల్లాలో పార్టీని పటిష్టం చేయడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. పార్టీ కోసం పూర్తి అంకితభావంతో పనిచేస్తున్న సోమిరెడ్డికి రాజ్యసభ ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం కార్యకర్తల్లో వ్యక్తమవుతుంది. సోమిరెడ్డిని రాజ్యసభకు నామినేట్ చేస్తే ఆయనను ఎన్నికల పర్యవేక్షణకు బ్రహ్మాండంగా ఉపయోగించుకోవచ్చనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది.

# కిరణ్‌కు మిగిలేదెవరు?



**కాంగ్రెస్ అధిష్టానంతో విభేదిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి సొంత పార్టీని పెట్టడం ఖాయంగా కనిపిస్తుంది. రాష్ట్ర విభజన నిర్ణయంతో సీమాంధ్రలో కాంగ్రెస్ చచ్చుబడిపోయింది. ఈ తరుణంలో కాంగ్రెస్ నుండి కొందరు వైకాపాలోకి వెళ్లారు. అక్కడ చోటు దొరకని వాళ్ళు తెలుగుదేశంలోకి పోతున్నారు. ఈ రెండు పార్టీలలోకి పోవడం ఇష్టంలేక, అలాగని మునిగిపోయే కాంగ్రెస్‌లో ఉండలేక కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు సందిగ్ధావస్థలో ఉన్నారు. వీరికోసం పుట్టబోయేదే కిరణ్ కొత్తపార్టీ.**

కిరణ్ పార్టీకి మన జిల్లాలో సారధులెవరనేది అంతుబట్టడం లేదు. జిల్లా నుండి కాంగ్రెస్‌లో కీలకపాత్ర పోషిస్తున్న ఆనం సోదరులు తాము కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు. ఎమ్మెల్యేలలో మిగిలింది ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిలు. వీళ్ళిద్దరు కూడా తెలుగుదేశంలో సీట్లను రిజర్వ్ చేసుకున్నట్లు తెలుస్తుంది. నెల్లూరు నగరం నుండి పోటీ చేయడానికి ముంగమూరు సిద్ధమవుతున్నారు. ఇక కిరణ్‌కు బంధువయిన ఆదాల ఆయన పెట్టే పార్టీలో చేరే అవకాశాలు మాత్రం లేవు. పనబాక దంపతులు పక్కా కాంగ్రెస్ విధేయులు. వారి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. ఇక నేదురుమల్లి కుటుంబమూ అంతే. ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి పేరు మాత్రం వినిపిస్తుంది. కిరణ్ పార్టీ పెడితే జిల్లా సారధిగా ఆయనే ఉంటాడనే ప్రచారం జరుగుతుంది. ఇక కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, వై.సుమంత్‌రెడ్డిలు కిరణ్ వెంట వుండవచ్చని సమాచారం. కాకపోతే ఎన్నికల నాటికి వైకాపా, తెలుగుదేశం, కాంగ్రెస్‌లలో టిక్కెట్లు ఆశించి అవి రాక భంగపడ్డ నాయకులు మాత్రం కిరణ్ పార్టీలో దండిగా చేరే అవకాశాలున్నాయి.

# అక్కడ మాకు... ఇక్కడ మీకు



- ఐదు నియోజకవర్గాలలో సహకార సన్నాహాలు
- స్థానిక కాంగ్రెస్, దేశంల మధ్య అవగాహనకు అవకాశాలు

***సహకార పంచాయితీ ఎన్నికలలో కాంగ్రెస్, తెలుగుదేశంల మధ్య ఏర్పడ్డ బలమైన స్నేహసంబంధం అసెంబ్లీ ఎన్నికలలోనూ కొనసాగనుంది. అయితే ఇది అన్ని నియోజకవర్గాలకు పాకకుండా కొన్ని నియోజకవర్గాలకు పరిమితంకానుంది. కాంగ్రెస్‌కు బలమైన నాయకుడు లేని చోట తెలుగుదేశంకు మద్దతిస్తారు. అలాగే తెలుగుదేశంకు బలమైన నాయకత్వం లేని చోట కాంగ్రెస్‌కు మద్దతిస్తారు. ఇప్పటివరకు దీనిపై ఇరుపార్టీల నేతల మధ్య ప్రత్యక్షంగా చర్చలు జరగనప్పటికి ఎన్నికల సమయంలో జరగబోయేదిదే! వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించడమే లక్ష్యంగా మ్యాచ్‌ఫిక్సింగ్‌కు అవకాశముంది.***

ఆత్మకూరులో కాంగ్రెస్‌కు ఆనం రామనారాయణరెడ్డి బలమైన అభ్యర్థి. ఇక్కడ తెలుగుదేశానికి గట్టి అభ్యర్థి లేదు కాబట్టి ఆ పార్టీ కేడర్ కాంగ్రెస్‌కు సహకరిస్తుంది. అలాగే ఉదయగిరిలో కాంగ్రెస్‌కు గట్టి నాయకత్వం లేదు. కాబట్టి అక్కడ తెలుగుదేశం అభ్యర్థి బొల్లినేని రామారావుకు కాంగ్రెస్ శ్రేణులు సహకరించవచ్చు. సర్వేపల్లిలో వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఓడించడం కాంగ్రెస్, తెలుగుదేశంల ఉమ్మడి లక్ష్యం. ఇక్కడ తెలుగుదేశం అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలలో ఎవరు పోటీ చేసినా కాంగ్రెస్ కేడర్ అండదండలుంటాయి. ఆనం వివేకానందరెడ్డి పార్లమెంట్‌కు పోటీ చేస్తే నెల్లూరు రూరల్‌లోనూ కాంగ్రెస్‌కు గట్టి అభ్యర్థి కొరత ఉంటుంది. అలాగే నెల్లూరు నగరంలోనూ టీడీపీ అభ్యర్థిగా ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పోటీ చేస్తే, ఇక్కడ కాంగ్రెస్ పోటీ నామమాత్రమవుతుంది. ఈ రెండుచోట్ల కాంగ్రెస్ కేడర్ తెలుగుదేశంకు సహకరిస్తుందనే అనుమానం ఉంది. కావలిలోనూ కాంగ్రెస్ డమ్మీ కావాల్సిందే. ప్రధానపోటీ వైకాపా, టీడీపీల మధ్యే వుండబోతుంది. ఈ సమయంలో ఇక్కడా మ్యాచ్ ఫిక్సింగ్‌కు అవకాశం వున్నట్లు తెలుస్తుంది.



# మాదాసు కుల చిచ్చు

***తెల్లారింది మొదలు ఆయన తిరిగేది రెడ్ల వెంట... దివంగత మహానేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుధు ఈయన ఆయన వెనుక తోకలా తిరిగేవాడు. వైయస్ తర్వాత రోశయ్య సీఎం అయితే ఆయనకు తోకలా మారాడు. రోశయ్య తర్వాత కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎం అయితే... ఈయనది సేమ్ క్యారక్టర్. కిరణ్‌కు తోకలా వెన్నంటే ఉండేవాడు. ఇక సొంతజిల్లా నెల్లూరుకు వచ్చాడంటే మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి వెనుకో లేదంటే ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి వెనుకో ఉండాల్సిందే! ఆయన నిద్రలేస్తే తిరిగేది రెడ్ల వెంట. కాని తిట్టేది కూడా ఆ రెడ్లనే! ఆ మహానాయకుడెవరో కాదు... పీసీసీ ఉపాధ్యక్షులు మాదాసు గంగాధరం.***

ఈయన ఎక్కడ కాలు పెడితే ఆ పార్టీ అక్కడ మటాష్ అనే ప్రచారం ఉంది. ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్నాడు కాబట్టి రేపు ఆ అదృష్టం ఆ పార్టీకి పట్టబోతుంది. రాజకీయపార్టీలకు అన్ని కులాలు, అన్ని మతాలు అవసరం. కాకపోతే ఒక్కో కులానికి ఒక్కో పార్టీలో ప్రత్యేకప్రాధాన్యత ఉంటుంది. రాష్ట్రంలో చూస్తే రెడ్లకు కాంగ్రెస్‌లో, కమ్మకు తెలుగుదేశంలో ప్రాధాన్యత ఉండేది. ఈమధ్య జగన్ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని స్థాపించడంతో రెడ్ల సామాజికవర్గం ఎక్కువుగా ఆ పార్టీలోకి పోయింది. ఇదంతా ప్రతిపార్టీకి అంతర్గతంగా తెలుసు. కాని పైకి మాత్రం కులాల ప్రస్తావన తేకూడదు.

కాని ఢిల్లీలో ఏఐసిసి సమావేశానికి వెళ్లిన మాదాసు గంగాధరం రాహుల్‌గాంధీ ముందే కులచిచ్చు రగిల్చాడు. రాష్ట్రంలో రెడ్లంతా జగన్ వెంట వెళ్లారని, ఇక వాళ్లకు టిక్కెట్లు ఇవ్వాల్సిన అవసరం లేదని, బిసిలు, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలకు ప్రాధాన్యతనివ్వాలని కోరాడు. ఇతర వర్గాలకు ప్రాధాన్యతనివ్వాలని కోరడంలో తప్పులేదుగాని, ఇంకో వర్గం గురించి మాట్లాడడం మాదాసు నీచగుణాన్ని బయటపెట్టింది. ఆయన కుల ప్రస్తావన మాటలను అక్కడే ఉన్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి లాంటి నాయకులు తిప్పికొట్టారు. అవకాశం కోసం ఎవరి పంచనైనా చేరి, అవసరం తీరాక ఆ పంచకు నిప్పుపెట్టడం మాదాసు నైజం. ఈ విషయం తెలిసి కూడా కాంగ్రెస్ నాయకులు ఆయనను తమ వెంట తిప్పుకుంటున్నారు. ఇప్పటికైనా వారు ఆయన నిజస్వరూపాన్ని గుర్తించాలి.

## లోక్‌సభ అభ్యర్థులపై...
# మూడు పార్టీలలో అంతర్మథనం

***నెల్లూరు లోక్‌సభ అభ్యర్థుల విషయంలో మూడు ప్రధానపార్టీలలో అంతర్మథనం జరుగుతుంది. పార్లమెంట్‌కు పక్కా రాజకీయనాయకులను నిలిపే పరిస్థితి ఎప్పుడోపోయింది. పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులకు అండదండలందించే శక్తి సామర్థ్యాలున్న ఆర్థికవేత్తలనే పార్టీలు పార్లమెంటు బరిలో దింపుతున్నాయి.***

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ చూస్తే సిటింగ్ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఉన్నాడు. రాజకీయ కోణంలోనే కాదు ఆర్థిక కోణంలో చూసినా ఇంకొకరి కోసం వెదకాల్సిన పనిలేదు. ఆయన పార్లమెంటుకు పోటీ చేస్తాడా లేక అసెంబ్లీకి వెళతాడా అనేది సందేహంగా వుంది. ఈమధ్య ఆయన మదిలో



అసెంబ్లీ ఆలోచన ఉన్నట్లు తెలుస్తుంది. తెలుగుదేశంపార్టీ నుండి చూస్తే ప్రస్తుతం పార్టీలో వున్న నాయకులలో పార్లమెంటుకు పోటీ చేసే ఆర్థిక స్థోమత ఎవరికీ లేదు. ఇక తప్పదనుకుంటే బీద మస్తాన్‌రావు మాత్రమే అందుకు సరిపోగలడు. ఇక కాంగ్రెస్ నుండి వచ్చే నాయకుల మీదే తెలుగుదేశంపార్టీ ఆధారపడాలి. నెల్లూరు లోక్‌సభకు పోటీ చేయడానికి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఆయన వద్దనుకుంటే వెదుకులాట తప్పదు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మీద కూడా తెలుగుదేశం ఆశలు పెట్టుకుంది. అయితే ఆయన రాకపోతే ఆదాల మీదే ఆధారపడాలి. ఆయన కూడా వద్దంటే ఇక ఉన్నవారిలోనే చూసుకోవాలి.

కాంగ్రెస్‌కు మాత్రం పార్లమెంట్ అభ్యర్థి ఎంపిక పెద్ద సమస్య కాగలదు. పార్టీ నుండి పార్లమెంట్‌కు పోటీ చేయడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. కొత్తవాళ్లు కూడా ఆ పార్టీ టిక్కెట్‌ను ఆశించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఆనం వివేకాకు పార్లమెంటు బాధ్యత తప్పదనిపిస్తుంది.

మొత్తానికి పార్లమెంట్ అభ్యర్థుల ఎంపిక ఈసారి మూడుపార్టీలకు కూడా కీలకంగా మారనుంది. పార్లమెంట్ అభ్యర్థుల సామర్థ్యంపైనే అసెంబ్లీ ఫలితాలు కూడా కొంత ఆధారపడి ఉంటాయి.

# కాంగ్రెస్ కుట్రలను ప్రజలే తిప్పికొడతారు


సభలో ప్రసంగిస్తున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

నెల్లూరు దర్గామిట్ట పోలీస్ కాలనీలో ఈనెల 19న జరిగిన వైఎస్సార్సీపీ ఆత్మీయ సమావేశంలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ కాంగ్రెస్, తెలుగుదేశంపార్టీలు ఎన్ని కుమ్మక్కు రాజకీయాలు చేసినా చెల్లవని రాష్ట్ర ప్రజలు మాత్రం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వైపే వున్నారని పేర్కొన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్సీపీ విజయఢంకా మోగిస్తుందని, జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలూ తమవేనని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ తెలంగాణలో టి.ఆర్.ఎస్.తో, సీమాంధ్రలో కిరణ్‌కుమార్‌రెడ్డి పెట్టే కొత్త పార్టీతో కుమ్మక్కై ఓట్లు దండుకోవాలని చూస్తోందని, రాష్ట్ర ప్రజలు ఈ కుట్రలను కుతంత్రాలను తిప్పికొడతారని అన్నారు. కోటంరెడ్డి మాట్లాడుతూ తాను ముప్పై సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాలలో జెండా భుజాన వేసుకొని పనిచేస్తున్నానని, ఈరోజు వైఎస్సార్సీపీలో తనకు అవకాశం వచ్చిందని అన్నారు. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ ప్రజలు తమ బిడ్డలా తనను ఆదరించి ప్రోత్సహిస్తే తాను వారికి ఒక నాయకుడిలా కాకుండా మంచి సేవకుడిలా పనిచేస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా స్థానికంగా ప్రజలకు సేవలిందిస్తున్న రోశమ్మ, సత్యనారాయణ రాజులను మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నగర వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, కె.వి. రాఘవరెడ్డి, భీమినేని మురహరి, మాజీ కార్పొరేటర్ తాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సేవాదళ్ సభ్యులు చింతంరెడ్డి జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైళ్లలో చోరీల నియంత్రణకు చర్యలు

**- రైల్వే ఎస్పీ జనార్దన్**



అన్ని రైళ్లలో గస్తీలు ముమ్మరం చేస్తున్నామని చోరీల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గుంతకల్ డివిజన్ రైల్వే ఎస్పీ ఎస్.జె.జనార్ధన్ తెలిపారు. నెల్లూరులోని రైల్వే డిఎస్పీ కార్యాలయాన్ని ఈ నెల 22న తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. వేసవిలో కేసులను వెంటనే పరిష్కరించాలని డిఎస్పీని ఆదేశించారు. వేసవిలో రైళ్లలో చోరీలు ఎక్కువగా జరిగే అవకాశమున్నందున పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఎస్పీలతో సంప్రదించి త్వరలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమిస్తామన్నారు. రైల్వేపట్టాల వెంబడి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. హిజ్రాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఫుట్ బోర్డులో కూర్చుని ప్రయాణం చేస్తూ ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారని, దీనిని అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. అలా కూర్చొనే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్పీ వెంట నెల్లూరు రైల్వేడిఎస్పీ పిఆర్ రాజేంద్రబాబు, సిఐ ఎం.విజయకుమార్ ఉన్నారు.

# పోతే... పోనీ... పోరా

## పోయేవాళ్ళుపోండీ... మళ్ళీరావద్దు. వేరే పార్టీలోకి పోయే దుర్గతి పట్టలేదు.




కాంగ్రెస్ పార్టీని వీడమని ఏ పార్టీలోకి వెళ్ళే ప్రసక్తే లేదని అంతటి దుర్గతి ఆనం కుటుంబానికి పట్టలేదని, కాంగ్రెస్ పార్టీని వీడి వెళ్లే వలసనాదులు, కోటీశ్వర్లు, ధనవంతులు తొందరగా పార్టీని వదిలి వెళ్ళాలని, పోయిన వాళ్ళు మళ్ళీ పార్టీలోకి రావద్దని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నెల 19న నెల్లూరు నగరంలోని ఏసి సెంటర్‌లో గల నగర కాంగ్రెస్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. వేరే పార్టీలోకి వెళ్ళాల్సిన అవసరం తనకుగాని, ఆనం రామనారాయణరెడ్డికి గాని, తమ కుటుంబ సభ్యులకుగాని లేదన్నారు. ఎంత మంది అవకాశవాదులు పార్టీని వీడిపోయినా పార్టీకి వచ్చే నష్టం లేదన్నారు. ప్రస్తుతం జిల్లా ఎంపి సీటుతో సహా పది అసెంబ్లీ సీట్లు కూడా ఇవ్వగలిగిన స్థానంలో ఉన్నామన్నారు. నెల్లూరు నగర అభివృద్ధి తమ లక్ష్యం అన్నారు. ముఖ్యమంత్రి పార్టీ పెట్టడం ఊహాజనితమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చేంత వరకు ఈ రాష్ట్రం విభజన జరగదన్నారు. ఆనం కుటుంబం అంటే ఓ రాజకీయ పాఠశాల అని అభివర్ణించారు. పార్టీని వీడి వెళ్ళే వాళ్ళు త్వరగా వెళితే వారి స్థానంలో అభ్యర్థులను నియమిస్తామన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి అధ్యక్షులు చాట్ల నరశింహరావు, మాజీ కార్పొరేటర్లు, పుట్టా రామకృష్ణారెడ్డి, శిరిగిరి చక్రవర్తి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌కి తుంగా శ్రీదేవమ్మ

# 2.50లక్షల విరాళం

**క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధికి చేయూత**



నెల్లూరు పొదలకూరురోడ్డులో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జక్కా సుజాతమ్మ క్యాన్సర్ నిర్ధారణ కేంద్రానికి తనవంతు సాయంగా 2.50లక్షల రూపాయలను శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ అందించారు.

'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారి 19వ వర్ధంతిని పురస్కరించుకుని జనవరి 18వ తేదీ శనివారం మధ్యాహ్నం 'లాయర్' సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమంలో జిల్లా అదనపుజాయింట్‌కలెక్టర్ సి.హెచ్.పెంచలరెడ్డి ద్వారా ఈ చెక్కును ఆసుపత్రి డైరెక్టర్ డా॥ టి.లక్ష్మికి ఆమె అందించారు. ఆసుపత్రి కమిటీ సభ్యుడు వాకాటి విజయకుమార్‌రెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నాడు.

క్యాన్సర్ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మించ తలపెట్టిన డైనింగ్ హాల్ కొరకు తన భర్త తుంగా రాజగోపాల రెడ్డి స్మృత్యంకంగా ఈ నిధులను ఖర్చు చేయవలసిందిగా శ్రీదేవమ్మ కోరారు.

## గాంధీ వర్ధంతి సందర్భంగా

## 30న దేశభక్తి గీతాల పోటీ

సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ 66వ వర్ధంతి పురస్కరించుకుని ఔత్సాహిక గాయనీ గాయకులకు దేశభక్తి గీతాల పోటీని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ తెలిపారు. ఈ పోటీలను ఈ నెల 30వ తేది గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు టౌన్‌హాలు ఆవరణంలోని గ్రంథాలయం మిద్దెపైన వున్న వర్ధమాన సమాజంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెంటనే బహుమతి ప్రధానం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు పాల్గొంటారని ఇతర వివరాలకు 7799076909 సెల్ నెంబరులో సంప్రదించాలని కోరారు.


ఈ నెల 23వ తేదీన నెల్లూరులోని అనిల్‌గార్డెన్స్‌లో జరిగిన రత్నం హైస్కూల్ 10వ వార్షికోత్సవంలో పాల్గొని చిన్నారుల కళాకృతులను తిలకిస్తున్న రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కె.వి.రత్నం, డైరెక్టర్లు కె.వేణుగోపాల్, డా॥ కె.కృష్ణకిషోర్


# మార్టిగేజ్ పేరుతో దోపిడి

(మొదటిపేజీ తరువాయి)

అవినీతికి స్నేహితుడిలా, పనితీరుకు శత్రువులా మారింది. నెల్లూరు నగరంలో మార్ట్గేజ్ వ్యవహారం అధికారులకు కాసుల కల్పవృక్షంలా వుంది. నగరపాలక సంస్థ పరిధిలో అపార్ట్‌మెంట్ కడుతున్నా, వాణిజ్య, నివాస భవనాలు కడుతున్నా 10 శాతం స్థలాన్ని ముందుగా కార్పొరేషన్‌కు తాకట్టు పెట్టాల్సి వుంటుంది. నగరపాలక సంస్థ ఆమోదించిన ప్లాన్ ప్రకారం ఈ భవనాలు, లేదా అపార్ట్‌మెంట్‌లు ఉంటే మార్ట్గేజ్ రిలీజ్ చేస్తారు. ప్లాన్ ప్రకారం 10శాతంపైగా నిర్మాణాన్ని ఉల్లంఘిస్తే మార్ట్గేజ్ రిలీజ్ చేయకూడదు. గతంలో 10శాతానికి పైగానే ప్లాన్‌ను అధిగమించి నిర్మాణాలు జరిగి ఉన్నాయి. రాజకీయంగా అండదండలున్నోళ్లు, లేదా లంచాలు ఇచ్చినోళ్లు వాటిని రిలీజ్ చేయించుకోగలిగారు. ఇటీవలకాలంలో చాలా మంది నిర్మాణదారులు ప్లాన్ ప్రకారమే అపార్ట్‌మెంట్లు, భవనాలు కడుతున్నారు. అటువంటి వాటికి మార్ట్గేజ్ రిలీజ్ చేయడానికి టౌన్‌ప్లానింగ్‌వాళ్లు నెలల తరబడి తిప్పుకుంటున్నారు. నిబంధనల ప్రకారం కట్టినా మార్ట్గేజ్ రిలీజ్ కోసం మామూళ్లు ఇచ్చుకోక తప్పడం లేదు. మార్ట్గేజ్ రిలీజ్ ఆలస్యం జరిగితే ముఖ్యంగా బిల్డర్‌లు నష్టపోతుంటారు. అపార్ట్‌మెంట్ పూర్తయ్యి, మార్ట్గేజ్ రిలీజ్ కాకపోతే, మార్ట్గేజ్ క్రింద ఉన్న ప్లాట్లను అమ్ముకోలేరు. కాలం గడిచే కొద్ది తెచ్చిన అప్పులపై వడ్డీలు పెరుగుతుంటాయి. ఈ బాధలు భరించలేక బిల్డర్లు ఎక్కువమొత్తంలో నగరపాలక సంస్థ అధికారులకు లంచాలు ఇచ్చి మార్ట్గేజ్ రిలీజ్ చేయించుకున్నారు. ఇటీవల ఫత్తేఖాన్‌పేటలో ఓ బిల్డర్ మార్ట్గేజ్ విడుదల కోసం కార్పొరేషన్‌కు కట్టాల్సిన ఫీజు కాకుండా లంచాల క్రిందే 5లక్షల రూపాయలు ఇచ్చాడని సమాచారం. లైసెన్స్‌డ్ బిల్డింగ్ సర్వేయర్ ఇచ్చిన ప్లాన్‌ను అధికారులు అప్రూవల్ చేసి మార్ట్గేజ్ రిలీజ్ చేయడం లేదు. ఎందుకంటే వీరివద్ద నుండి పెద్దమొత్తంలో అవినీతి సొమ్ము రాదు. ప్లాన్‌ను ఆమోదించకుండా కొంతకాలం పెండింగ్ పెడితే నేరుగా నిర్మాణదారులే కార్పొరేషన్ ఆఫీసుకు వస్తున్నారు. పది కాకపోతే ఇరవై తీసుకో అన్నట్లు మాట్లాడి తొందరగా తమ పనులు కానిచ్చుకుంటారు. అవినీతి సొమ్మును పెంచుకోవడానికి నగరపాలక సంస్థ అధికారులు ఈ టెక్నిక్‌ను బాగానే వాడుకుంటున్నారు.

అక్రమ నిర్మాణాల విషయంలో నగర పాలక సంస్థ వాళ్లు మరో టెక్నిక్‌ను ఉపయోగిస్తుంటారు. నగరంలో చాలాచోట్ల అక్రమనిర్మాణాలు జరుగుతుంటాయి. అవి అక్రమమని తెలిసినా మన కార్పొరేషన్ వాళ్లు మొదట్లోనే అడ్డుకునే ప్రయత్నం చేయరు. ఒకటి, రెండు స్లాబులు పడ్డాక అప్పుడు గడ్డపారలెత్తుకుని పోతారు. వీళ్లను చూసి భవన నిర్మాణదారుడు వణికిపోతాడు. చాలా ఖర్చుపెట్టాను కాబట్టి కూల్చొద్దని ప్రాధేయపడతాడు. మేం కూలిస్తే నీకింత నష్టం, అదే మాకింతిస్తే ఆ నష్టం వుండదని రేటుకట్టి చెబుతారు. రేటు కుదిరాక అక్రమ నిర్మాణం సక్రమమైపోతుంది.

ఇలా అక్రమనిర్మాణాలు, మార్ట్గేజ్ రిలీజ్‌లో అక్రమాలకు అంతూపొంతూ లేకుండాపోతుంది. ఏ నిర్మాణం చేపట్టలన్నా నగరపాలక సిబ్బంది నిర్వాకం గుర్తొచ్చి నిర్మాణదారులు హడలిపోతున్నారు.




## కుడితిలో పడ్డ ఎలుకలు

సోనియాగాంధీ సృష్టించిన విభజన సునామీతో రాష్ట్ర నాయకుల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకల్లా మారింది. తెలుగుదేశం, కాంగ్రెస్‌లకు భవిష్యత్ లేదు. వీళ్లందరూ కిరణ్ కొత్త పార్టీ వైపు చూస్తున్నారు.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## నోటి పొగరు

కేంద్రమంత్రి మణిశంకర్ అయ్యర్‌కు నోటి పొగరు ఎక్కువ. ఏఐసిసి సదస్సు వద్ద మోడీని టీ అమ్ముకోవాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన విజ్ఞతను దిగజారుస్తున్నాయి. టీ అమ్ముకునే వాళ్లు అంత చీప్‌గా కనిపిస్తున్నారా? కాంగ్రెస్‌వాళ్ల లాగా దేశాన్ని అమ్ముకుని బ్రతికే కంటే టీ అమ్ముకుని బ్రతికేవాళ్లే ఎంతో నయం. మణిశంకర్ అయ్యర్ ఈ సిగ్గు తెలుసుకోవాలి.

ఎస్.మణి, తిరుపతి.

## వాస్తవం తెలుసుకుంది

రాష్ట్ర విభజనపై కాంగ్రెస్ తీరు చాలా దారుణంగా ఉందని బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలలో ఆ పార్టీ నాయకులు గుర్తించడం శుభ పరిణామం. విభజన తీరు దారుణంగా ఉందని వాళ్లే చెబుతున్నారు. మరి ఇలాంటి ఏకపక్ష బిల్లుకు ఆ పార్టీ మద్దతునిస్తుందని అనుకోవడం లేదు. కాంగ్రెస్‌లాగా కాకుండా బీజేపీ విజ్ఞతతో వ్యవహరించి విభజన బిల్లుపై నిర్ణయం తీసుకోవాలి.

జి.యస్.రావు, నెల్లూరు.

## సినీపరిశ్రమ గుడ్డిదైంది

తెలుగు సినీపరిశ్రమకు రెండు కళ్లుగా చెప్పకునే ఎన్టీఆర్, ఏఎన్ఆర్ ఇద్దరూ స్వర్గస్తులవడంతో సినీ పరిశ్రమ గుడ్డిదైంది. తొలితరం ఇక పూర్తిగా కనుమరుగైంది. తెలుగు సినిమాలోనే కాకుండా, భారత సినీ చరిత్రలో కూడా సీనియర్ ఆర్టిస్ట్ అయిన అక్కినేని నాగేశ్వరరావు ఎంతో మంది ఆర్టిస్ట్‌లకు ప్రేరణగా నిలిచారు. ఆయన సినిమాలు చూస్తూ పెరిగిన వారు ఈరోజు స్టార్లుగా కొనసాగుతున్నారు.

జె.రాజ్యలక్ష్మి, నెల్లూరు.

## 'ప్రభా'తం

ఒక చోట హుషారు... ఇంకో చోట బేజారు. అక్కడ సమరోత్సాహం... ఇక్కడ నిరుత్సాహం. వాళ్లు సమర్ధవంతమైన నాయకత్వంతో ప్రజాదరణ పొందుతున్న ఓ నాయకుడిని ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించి ముందుకు పోతుంటే, వీళ్లు మాత్రం ప్రధానమంత్రి అభ్యర్థిని ప్రకటించి తమ కుటుంబ ఇమేజ్ పోగట్టుకోవడం ఇష్టం లేక ఆయనను కేవలం ప్రచారానికే పరిమితం చేసిన వైనం అక్కడ నెలకొన్న నిర్లిప్తతకు సాక్ష్యం.

2014లో కేంద్రంలో అధికారం కోసం హోరాహోరీగా తలపడుతున్న రెండు ప్రధాన జాతీయపార్టీల కార్యవర్గ సదస్సులు ఒకే సమయంలో ఒకే చోట జరగడం విశేషం. ఈ రెండు సదస్సులు కూడా ఆ పార్టీలు ఏ విధంగా ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతున్నాయనేదానికి సంకేతంగా నిలుస్తున్నాయి. కేంద్రంలో ఎలా అధికారాన్ని నిలుపుకోవాలనే దాని కోసం కాంగ్రెస్, పదేళ్లక్రితం దూరమైన అధికారాన్ని తిరిగి ఎలా పొందాలనేదానిపై బీజేపీ తీవ్రంగా మధనపడుతున్నాయి. ఎవరి పంథాను వాళ్లు ఏర్పరచుకున్నారు.

బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల వేదిక నుండి ఆ పార్టీ అగ్రనాయకులు జాతికి ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించారు. ఈ సమావేశంలో రాముడి ప్రస్తావన లేదు. అయోధ్య అంశం లేదు. మత ప్రాతిపదికన ఏ అంశమూ లేదు. కేవలం దేశాభివృద్ధి, దేశ భద్రత, జాతి సమైక్యత లక్ష్యంగా ఆ పార్టీ ప్రచారం ప్రారంభించింది. ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీని ఎంపిక చేసినప్పుడు అలక వహించిన అగ్రనేత అద్వానీ సైతం ఈ సమావేశంలో తన వాణి, బాణి మార్చారు. మోడీని ఓ గొప్ప పరిపాలకుడిగా ప్రశంసిస్తూ ఆయనకు తన మద్దతు తెలపడంతో బీజేపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపినట్లయ్యింది. కదన రంగానికి కలిసి ముందుకు పోదామనే సంఘటిత భావం ఆ పార్టీలో వెల్లివిరిసింది. ఇక కాంగ్రెస్‌పార్టీని తూర్పారబట్టడానికి ఈ వేదికను నరేంద్ర మోడీ ఉపయోగించుకున్న తీరు అమోఘం. దేశాన్ని అమ్ముకునే వాళ్లకంటే టీ అమ్ముకునే వాళ్లే నయమంటూ ఆయన చేసిన విమర్శలు కాంగ్రెస్‌ను కుళ్లబొడవడమే కాక ఇటు సామాన్య ప్రజానీకాన్ని కూడా ఆకట్టుకున్నాయి. 60ఏళ్ల పాలకులకు అవకాశమిచ్చారు. 60నెలలు మీ సేవకులకు అవకాశమివ్వండంటూ అదే వేదికపై మోడీ చేసిన అభ్యర్థన జాతి జనుల గుండెల్లోకి బలంగానే దూసుకుపోయింది. ఈ సమావేశాలలోనే అద్వానీ, రాజ్‌నాథ్‌సింగ్ వంటి అగ్రనేతలు మాట్లాడిన తీరు ఎంతో హుందాగా సాగింది.



### వారసత్వం... నాయకత్వం

కాంగ్రెస్ సాంప్రదాయాలేంటో జనానికి తెలియంది కాదు. రేపు కాంగ్రెస్‌కు మెజార్టీ సీట్లు వస్తే రాహుల్‌ను కాకుండా ఇంకెవరినన్నా ప్రధానిని చేస్తారా అంటే అదీ లేదు. కాంగ్రెస్‌కు అధికారం అంటూ వస్తే సోనియాగాంధీ నిర్ణయించిన వాళ్లే ప్రధాని అనేది నగ్నసత్యం.

అయితే అంతకుముందే జరిగిన ఏఐసిసి జాతీయ కార్యవర్గ సమావేశాలు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. సోనియా, రాహుల్ భజనకే ఇక్కడ పెద్దపీట పడింది. గత పదేళ్ల యుపిఏ పాలనలో జరిగిన వైఫల్యాలను చర్చించుకోవడానికి, వాటిని అధిగమించడానికి ప్రాధాన్యతనివ్వలేదు. ప్రధాని అభ్యర్థిని ప్రకటించడం మా సంప్రదాయం కాదంటూనే ఆ పార్టీ ప్రచారసారధిగా రాహుల్‌గాంధీని నియమించారు. కాంగ్రెస్ సాంప్రదాయాలేంటో జనానికి తెలియంది కాదు. రేపు కాంగ్రెస్‌కు మెజార్టీ సీట్లు వస్తే రాహుల్‌ను కాకుండా ఇంకెవరినన్నా ప్రధానిని చేస్తారా అంటే అదీ లేదు. కాంగ్రెస్‌కు అధికారం అంటూ వస్తే సోనియాగాంధీ నిర్ణయించిన వాళ్లే ప్రధాని అనేది నగ్న సత్యం. కాకపోతే రేపటి ఎన్నికల్లో పార్టీ ఓడిపోతే అది పార్టీ ఉమ్మడి బాధ్యతగా స్వీకరిస్తుంది. గెలిస్తే మాత్రం ప్రచారసారధిగా అది రాహుల్ ఖాతాలో జమపడుతుంది. ఏఐసిసి సమావేశాలలో రాహుల్‌ను ప్రధానిని చేయాలన్న డిమాండ్లు సహజంగానే వచ్చాయి. దేశ వ్యాప్తంగా ప్రజలందరూ గత కొంతకాలంగా సబ్సిడీ సిలిండర్లను 12 చేయాలని కోరుతుంటే మన ప్రధాని ఎప్పుడూ దానిని పట్టించుకోలేదు. కాని సమావేశాలలో రాహుల్‌గాంధీ కోరగానే 12సిలిండర్లకు అంగీకరించారు. అంటే ఇక్కడ కోట్లాదిమంది జనాల కంటే రాహుల్ మాటకే ప్రాధాన్యతనిచ్చారన్న మాట. ఇదొక ఎన్నికల గిమ్మిక్కు అనేది ఇట్టే అర్థమైపోతుంది.

ఏఐసిసి సమావేశాలు కాంగ్రెస్‌లో నెలకొన్న నైరాశ్యానికి అద్దంపట్టాయి. రాహుల్ ముసుగుతో ఎన్నికలకు పోయినా ఫలితం ఉండదనే భావం ఆ పార్టీ వర్గాలలోనూ వ్యక్తమవుతుంది. ముఖ్యంగా పదేళ్ల యుపిఏ పాలనా వైఫల్యాలు కాంగ్రెస్‌ను నీడలా వెంటాడుతున్నాయి. పెరిగిన ధరలు, పేట్రేగిపోతున్న ద్రవ్యోల్బణం, తరుగుతున్న రూపాయి, కరుగుతున్న వృద్ధిరేటు, అభద్రతాభావంలో దేశ భద్రత, ఉగ్రవాదంపై చచ్చువైఖరి వంటివి కాంగ్రెస్ మెడకు ఉచ్చులా బిగుసుకుంటున్నాయి. ఎన్నికల సమయంలో కష్టాల్లో ఉన్నామని కాంగ్రెస్ గుర్తించినప్పుడు ప్రజలను కులాలు, మతాలవారీగా చీల్చడం ఆ పార్టీ నైజం. ఇప్పుడూ అదే పనికి ఒడికట్టింది. ఉగ్రవాదం ఆరోపణలపై జైళ్లలో వున్న మైనార్టీలను విచారించి విడుదల చేయాలంటూ కేంద్ర హోంమంత్రి పి.చిదంబరం జారీచేసిన ఆదేశాలు ఖచ్చితంగా ఓటుబ్యాంకు రాజకీయ ఖాతాలోకే చేరుతాయి. రక్తాన్ని రుచిమరిగిన పులి ఆకుకూరలు తిని బ్రతుకుతుందా? ఆరు దశాబ్దాలుగా అధికారం రుచి మరిగిన కాంగ్రెస్‌పార్టీ కూడా అంతే! దేశాన్ని ఏలికలు, పీలికలు చేసైనా, జనాన్ని కులాలు మతాల వారీగా చీల్చయినా అధికారం నిలబెట్టుకోవడమే వారి ముందున్న కర్తవ్యం. ఈ పదేళ్లలో చేసిన ఘనకార్యాలేవీ లేకపోగా, వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ, కేవలం మతపరమైన ఓటుబ్యాంకు ద్వారా మళ్లీ అధికారం కోసం అర్రులు చాస్తున్న కాంగ్రెస్ పోకడలే దేశానికి ప్రమాదకరం.

## 'అంతర్'జాతీయం

- పార్టీ ఆదేశిస్తే లోక్‌సభకు పోటీ చేస్తానని ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు.
- ప్రవాస భారతీయ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్‌కు అమెరికా అత్యున్నత బోధనా పురస్కారం 'రోబర్డ్ పాస్టర్ బెర్రీ అవార్డ్–2014' లభించింది. ఈమేరకు బేలర్ విశ్వవిద్యాలయం ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రకటించింది.
- అమెరికా అధ్యక్షుడు ఒబామా సలహాదారుడు, ప్రస్తుతం బోయింగ్ వాణిజ్య విమానయాన సేవలకు డైరక్టర్‌గా వున్న అనీష్‌గోయెల్ దక్షిణాసియా మేధోమధన బృందంలో సీనియర్ సభ్యుడిగా నియమితులయ్యారు. భారత అమెరికన్ అయిన అనీష్‌గోయెల్ అమెరికా, భారత్‌ల మధ్య సంబంధాలు మెరుగుపరచడానికి కృషిచేశారు.
- పోలీసుల చెరలో ఉన్న ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది యాసిన్‌భత్కల్‌ను విడిపించడానికి ఆ సంస్థ పెద్ద ప్రణాళిక వేసిందని నిఘావర్గాలు హెచ్చరించాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కిడ్నాప్ చేయడం లేదా విమానాలను హైజాక్ చేయడం ద్వారా భత్కల్‌ను విడిపించుకోవాలని ఐఎం ప్లాన్ చేసినట్లు నిఘా వర్గాల సమాచారం.
- లోక్‌సభ ఎన్నికలకు ముందు ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఒంటరిగానే బరిలోకి దిగుతామని యూపి ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీపార్టీ నేత అఖిలేష్ యాదవ్ ప్రకటించారు.
- అణ్వస్త్రాన్ని మోసుకెళ్లగల వ్యూహాత్మక బాలిస్టిక్ క్షిపణి అగ్ని–4ను 20వ తేదీ ఒడిసా తీరానికి చేరువలో వున్న వీలర్ ఐలాండ్‌లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజి నుండి విజయవంతంగా ప్రయోగించారు. స్వదేశీపరిజ్ఞానంతో రూపొందించిన ఈ క్షిపణి నాలుగువేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేధించగలదు. ఈ ఆధునిక అస్త్రాన్ని సైన్యం అమ్ములపొదిలోకి చేర్చనున్నారు.
- హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా తొలిసారి సీనియర్ మహిళా ఐపియస్ అధికారి అరుణాబహుగుణను నియమించారు. 1979బ్యాచ్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్ కేడర్ అధికారి ఆమె. రాష్ట్ర పోలీస్‌శాఖలో ఎన్నో కీలక ఉద్యోగబాధ్యతలు నిర్వర్తించారు.
- భారత భద్రతావసరాలను తీర్చడంలో ఇస్రో సమర్థవంతంగా పనిచేస్తుందని ప్రధాని మన్మోహన్‌సింగ్ కొనియాడారు. 21వ తేదీ ఇస్రో ఛైర్మెన్ రాధాకృష్ణన్, పలువురు శాస్త్రవేత్తలు తనను కలిసిన సందర్భంగా ప్రధాని ఇస్రో అంతరిక్ష విజయాలను అభినందించారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- అధికారంలోకి వచ్చాక తెలంగాణ ఇస్తాం.
– బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో రాజ్‌నాథ్‌సింగ్.
**వ్యాఖ్య :- *అంటే ఎన్నికలలోపు తెలంగాణ లేనట్లేనా...!***

వార్త :- తెలంగాణ ఏర్పాటు అనివార్యం. – అసెంబ్లీలో జేపీ.
**వ్యాఖ్య :- *కేసీఆర్ కూడా ఇంత గట్టిగా ఎప్పుడూ కోరలేదే!***

వార్త :- వైకాపా దోపిడీదారుల పార్టీ. – నారా లోకేష్.
**వ్యాఖ్య :- *ఏదైనా ప్రారంభమయ్యింది మన నుండే కదా!***

వార్త :- రాష్ట్రంలో కాంగ్రెస్ భూస్థాపితమే. – అశోక్‌బాబు.
**వ్యాఖ్య :- *ఆ సంగతి సోనియాగాంధీకి కూడా తెలుసుగా!***

వార్త :- సప్తవర్ణాల భారత్‌ను ఆవిష్కరిస్తాం. – నరేంద్ర మోడీ.
**వ్యాఖ్య :- *ప్రస్తుతం సప్తవర్గాల భారత్ ఉంది కదా!***

వార్త :- అధికారంలోకి వస్తే వై.యస్. విగ్రహాలను కూల్చేస్తాం.
– గాలి ముద్దుకృష్ణమనాయుడు.
**వ్యాఖ్య :- *ఆ మాట చెప్పండి... వచ్చే ఓట్లు కూడా రావు.***

వార్త :- జైనులను మైనార్టీలుగా గుర్తించండి. – ప్రధానితో రాహుల్.
**వ్యాఖ్య :- *పనిలో పనిగా హిందువులను కూడా గుర్తిస్తే సరి!***

వార్త :- నిజాం లౌకికవాది. – అక్బరుద్దీన్.
**వ్యాఖ్య :- *ఈలెక్కన చూస్తే దేశంలో మతతత్వవాదులు లేనట్లే.***

వార్త :- అన్నాడిఎంకెతో పొత్తు మేలు. – సీతారాం ఏచూరి.
**వ్యాఖ్య :- *రాష్ట్రానికో పార్టీకి తోకలా తయారవుతున్నారన్నమాట.***

వార్త :- పోలీసుల పిల్లలకు మంచిచదువులు. – డిజిపి ప్రసాద్‌రావు.
**వ్యాఖ్య :- *పోలీసులకు కూడా మంచి నీతిపాఠాలు చెప్పించండి.***

వార్త :- నియంతృత్వానికి నిదర్శనం నిజాంపాలన. – కోడెల.
**వ్యాఖ్య :- *తెలంగాణ వాళ్లకు ఆయన బానిస పాలనే బాగున్నట్లుంది.***

వార్త :- పట్టణాభివృద్ధికి ఏం చేయాలి. – సీఎస్‌ను అడిగిన ప్రధాని.
**వ్యాఖ్య :- *ఇప్పుడు తెలుసుకుని మాత్రం ఏం చేస్తారు.***

వార్త :- 12సిలిండర్లపై ఈ వారమే నిర్ణయం. – కేంద్రమంత్రి మొయిలీ.
**వ్యాఖ్య :- *రాహుల్ కోరిక కదా... ఆ మాత్రం స్పీడుంటుందిలే!***

## ఓపెన్ ఎయిర్ జైలును పరిశీలించిన ఐజీ

నెల్లూరు జిల్లా కాకుటూరులో ఉన్న ఓపెన్ ఎయిర్ జైలును, అక్కడ జరుగుతున్న డ్రైనేజీ ఏర్పాట్లును జైళ్ళశాఖ ఐజీ సునీల్‌కుమార్ రాయలసీమ రేంజ్ డిఐజీ జయవర్ధన్, నెల్లూరుజిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ, ఏఆర్ ఎస్పీ బిఆర్‌యస్ మూర్తిలు ఈ నెల 21వతేది పరిశీలించారు. జైలు సమీపంలో జిల్లా పోలీసు శిక్షణ కేంద్రానికి సంబంధించిన స్థలం ఉండటంతో అక్కడ జైలుకు అవసరమైన డ్రైనేజీ మార్గం పోలీసు శిక్షణ కేంద్రానికి సంబంధించిన స్థలం మీదుగా వెళ్ళాల్సి ఉండటంతో రెండు శాఖల అధికారులు కలిసి ఈ విషయంపై చర్చించుకున్నారు. డ్రైనేజీ మార్గాన్ని పరిశీలించారు. ఇరుశాఖలకు సంబంధించి ఎకరం భూమి విషయంపై ఒక ఒప్పందానికి వచ్చారు. అనంతరం ఓపెన్ జైలును పరిశీలించారు. వీరితో పాటు నెల్లూరు కేంద్ర కారాగారం సూపరింటెండెంటు ఎం.ఆర్.రవికిరణ్, డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు, పోలీసు శిక్షణ కేంద్ర డిఎస్పీ, సిఐ తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వో, వీఆర్ఏ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం


సమావేశంలో ప్రసంగిస్తున్న జేసీ లక్ష్మీకాంతం

నెల్లూరు జిల్లాలో ఫిబ్రవరి 2వ తేదిన జరిగే వీఆర్వో, వీఆర్ఏ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరవ్వాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరించాల్సి వస్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం పేర్కొన్నారు. ఈ నెల 21వ తేది నెల్లూరులోని జిల్లా పరిషత్తు కార్యాలయంలో పరీక్ష కేంద్రాల ఛీఫ్ సూపరింటెండెంట్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ద్వారా జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని డివిజన్ హెడ్ క్వార్టర్లలో జరిగే ఈ పరీక్షకు సంబంధించి రెండు రోజుల్లో కేంద్రాల నివేదికను విడుదల చేస్తామన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు డిఆర్వో సమన్వయ కర్తగా, ఆర్డీవోలు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్లుగా వ్యవహరిస్తారన్నారు.

వీరి కింద ఛీఫ్ సూపరింటెండెంట్లు, అసిస్టెంటు ఛీఫ్ సూపరింటెండెంట్లను నియమించినట్లు తెలిపారు. ఏఎల్‌వోలను సిట్టింగ్ స్క్వాడ్‌గా నియమించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగే వీఆర్వో, వీఆర్ఏ పరీక్ష హాలుకు సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, పేజర్లు లాంటివి వినియోగించకూడని తెలిపారు. ఈ కార్యక్రంలో ఏఎస్పీ మూర్తి, ఆర్డీవోలు, కోదండ రామిరెడ్డి, రమణ పాల్గొన్నారు.

## ప్రైవేటు బస్సుల ఆగడాలు అరికట్టాలి

ప్రయాణీకుల ప్రాణాల పాలిట మృత్యుశకటాలుగా మారిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను తిరగకుండా అరికట్టాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేది నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. బెంగుళూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తూ మృతి చెందిన అయిదు మంది జిల్లా వాసులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రయాణీకుల ప్రాణాలను తీస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసారు. నెల్లూరు రవాణాశాఖ కమీషనర్‌కు నెలవారీ ముడుపులు అందుతుండడంతోనే జిల్లాలో తిరుగుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై నామమాత్రంగా దాడులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిబంధనలు పట్టని ప్రైవేటు బస్సులను రద్దు చేయకుంటే త్వరలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వాటిని తామే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్వర్, ధర్మవరం సుబ్బారావు, శింగంశెట్టి రవిచంద్ర, ఓ ప్రకాష్‌యాదవ్, సుధాకర్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.


## అలరించిన త్యాగరాజ ఆరాధనోత్సవం

నెల్లూరు వేదాయపాళెం త్యాగరాజనగర్‌లో వేంచేసియున్న శ్రీత్యాగరాజస్వామి దేవస్థానంలో ఈ నెల 21వ తేదీ శ్రీత్యాగరాజ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన శ్రీత్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు అలరించాయి. నెల్లూరుకు చెందిన కళాకారులు డివి సురేష్‌రావు, జెవియస్ఆర్ ప్రసాద్, మాదేశ్వరకుమార్, జె.బాలార్క, రమాదేవి, వనజలత నెల్లూరు ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల సంగీత విద్యార్థులు ఆలపించిన శ్రీత్యాగరాజ స్వామి పంచరత్న గోష్టి గానములు భక్తులకు వీనుల విందుగావించాయి. స్థానిక కళాకారులు ఆలపించిన శ్రీత్యాగరాజస్వామి కృతులు ఆకట్టుకున్నాయి. వీణపై హేమలక్ష్మి, వయోలిన్‌పై సోకేష్‌బాబు, రవికిరణ్‌సాయ్, మృదంగంపై పినాకపాణి, శాంతి, కళాధర్, హరిబాబు, ఘటంపై శివకుమార్ వాద్య సహకారమందించారు.

సేవాసమితి కార్యదర్శి డాక్టర్ యనమండ్ర నాగదేవి ప్రసాద్ నేతృత్వంలో శ్రీకుర్తాళం సిద్దేశ్వరపీఠం పురోహితులు మాచవోలు రమేష్‌శర్మ, ఆలయ అర్చకులు మురళీస్వామి, శ్రీసీతారామలక్ష్మణ హనుమత్సమేత శ్రీసద్గురు త్యాగరాజస్వామికి విశేషపూజలు నిర్వహించారు. ఈ మహోత్సవంలో కుర్తాళం శ్రీసిద్దేశ్వరి పీఠాధిపతి శిష్యులు రాధానందభావస్వామి శ్రీత్యాగరాజస్వామి పల్లకీసేవ ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు అన్న, తీర్థప్రసాదాలను వినియోగం చేసారు.

## సీమాంధ్రకు నష్టం కలిగించే బిల్లును బీజేపీ ఆమోదించదు

### బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



నెల్లూరు మినీబైపాస్ రోడ్డులో గల భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఈ నెల 22న జిల్లా పదాధికారుల సమావేశం జరిగింది. అందులో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ సీమాంధ్రులకు నష్టం కలిగించే రాష్ట్ర విభజన బిల్లును బీజేపీ కేంద్ర నాయకత్వం ఆమోదించదని తెలిపారు. ఇటీవల జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షులు రాజ్‌నాథ్‌సింగ్ ఈ విషయం స్పష్టం చేసారని తెలిపారు. జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ బీజేపీ గ్రామదర్శిని రెండవ విడత కార్యక్రమాన్ని జనవరి 25 నుండి 30 వరకు చేపట్టి ప్రజలకు చేరువ కావాలని, తద్వారా రాబోయే ఎన్నికలకు సిద్ధంకావాలని కార్యకర్తలకు సూచించారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కె.ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ ఈ దేశ దశ దిశ మార్చే శక్తి ఒక్క నరేంద్రమోడికే వుందని, జాతీయ కార్యవర్గ సమావేశంలో మోడీ ప్రసంగమే దీనికి నిదర్శనమని అన్నారు. ప్రతి కార్యకర్త సార్వత్రిక ఎన్నికలలో సర్వశక్తులు ఒడ్డి నరేంద్రమోడీని ప్రధానిని చేయడంలో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ కన్వీనర్ జెట్టి రామచంద్రారెడ్డి, నేషనల్ కౌన్సిల్ సభ్యులు ఆర్.రాజారాం, సీనియర్ నాయకులు సిహెచ్ రామప్పనాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ కిష్టయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.సుధాకర్‌రెడ్డి, బి మారుతీరెడ్డి, అన్నం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### ఫిబ్రవరి 12,13,తేదీల్లో

## తపాలా ఉద్యోగుల సమ్మె

ఫిబ్రవరి 12, 13 తేదీల్లో రెండు రోజుల సమ్మె నోటీసును నెల్లూరు తపాల శాఖ జేసీఏ నాయకులు ఈ నెల 21వ తేది పోస్టల్ సూపరింటెండెంట్‌కు అందజేసారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్‌పీఈ గ్రూపుసీ కార్యదర్శి ఎ.జాన్ ఆంథోని మాట్లాడుతూ 50 డిఏ మెర్జర్, జీడిఎస్ ఉద్యోగులను ఏడవ వేతన కమిటి పరిధిలోకి తీసుకురావాలని, కంటింజెంట్ సిబ్బందికి కొత్త జీతాలు, అరియర్స్ చెల్లించాలని డిమాండ్ తేసారు. పిఎఫ్ఆర్ డిఏ బిల్లును రద్దు చేయాలని, ఏడవ పే కమిటి సిఫార్సులు జనవరి ఒకటి 2014 నుంచి అమలు చేయాలని తదితర 15 డిమాండ్లతో సమ్మె నోటీసును అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీ-4 కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, జీడీఎస్ కార్యదర్శి ఎన్.పెంచలయ్య, ఎఫ్ఎన్‌పివో గ్రూప్‌సీ కార్యదర్శి ఎన్.రామమూర్తి, పీ-4 కార్యదర్శి ఖాదర్ మస్తాన్, ఈడీ యూనియన్ కార్యదర్శి సీఆర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### బియ్యం గింజలతో...

## "సమైక్య నినాదాలు"

నెల్లూరు జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కవి కాళహస్తి వెంకటశేషగిరిరావు వినూత్న రీతిలో 999 బియ్యపు గింజలతో సమైక్య నినాదాలను తెల్లటి బోర్డుపై రూపొందించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. సమైక్యాంధ్రను కోరుతూ ఏపీఎన్జీఓలు బుధవారం తలపెట్టిన "ఛలో హైదరాబాద్" కార్యక్రమం విజయవంతం కావాలని కోరుతూ మూడు గంటలు పాటు కష్టపడి సమైక్య నినాదాలను రూపొందించినట్లు వెంకటశేషగిరిరావు తెలిపారు.

### పోలీసు వాహనాలకు

## నెంబరు ప్లేట్లు తొలగింపు

నెల్లూరు ఏఆర్ పోలీసులు తమ వాహనాలకు పోలీసు స్టిక్కర్లు అతికించుకోవడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఇష్టం వచ్చినట్లు ఏర్పాటు చేసుకోవడంతో ఈ మధ్య జిల్లా ఎస్పీ పివిఎస్ రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేసారు. దీంతో ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం ట్రాఫిక్ సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసు పరేడ్‌గ్రౌండ్స్‌లో ఉంచిన 55 మోటార్ బైక్‌లకు నంబరు ప్లేట్లు మార్చారు. కొంత మంది తమ వాహనాలకు పోలీసు స్టిక్కర్లు వేసుకుని ఉండడంతో వాటిని తొలగించారు.

## చంద్రబాబుతోనే స్వర్ణయుగం

స్వర్ణయుగం రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.షరీఫ్ అన్నారు. సోమవారం నెల్లూరుకు వచ్చిన ఆయన జిల్లాలవారీగా నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ముస్లీం మైనార్టీలకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ చేపట్టబోయే సంక్షేమ పథకాలపై చర్చించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్రతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. దేశంలోని ముస్లిం మైనార్టీలను కాంగ్రెస్‌పార్టీ ఓటు బ్యాంకుగా వాడుకోవడమే తప్ప వారి అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోకుండా మోసంచేసిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు మున్వర్, ఖాదర్‌బాషాలు పాల్గొన్నారు.

## ఎన్నికలపై పోలీస్ సమావేశం

త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వాటిని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధంచేయాలని ఆర్డీవో మధుసూదనరావు పోలీసు అధికారులకు సూచించారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం డిఎస్పీ కె.చౌడేశ్వరి, డివిజన్ పరిధిలోని సి.ఐలు, ఎస్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్లను ప్రలోభపెట్టడమే కాకుండా నిర్బంధించడం, భయాందోళనకు గురిచేసే గ్రామాల పై దృష్టిసారించాలన్నారు. అందుకు సంబంధించిన నివేదికలను అందజేయాలని ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు.

## జగన్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే సాధ్యమని యల్ల శ్రీనివాసులురెడ్డి అన్నారు. గూడూరు 24సొసైటీ అధ్యక్షులు యల్ల శ్రీనివాసులురెడ్డి డైరెక్టర్ చంద్రమోహన్‌లు మంగళవారం ఎల్లసిరి గోపాల్‌రెడ్డి సమక్షంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, తెలుగుదేశం రెండూ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసాయి. తిరిగి రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఒక్క జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని నమ్మి ఆ పార్టీలో చేరామని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ సభ్యులు ఎల్లసిరిగోపాల్‌రెడ్డి గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త పాశంసునీల్‌కుమార్ గూడూరు పట్టణ వైయస్ఆర్ పార్టీ అధ్యక్షులు నాసినగాలు మరియు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. వీరితో పాటు చక్రపాణి, రమణయ్య, వెంకట రమణయ్య తదితరులు కాంగ్రెస్‌పార్టీకి రాజీనామా చేసి జగన్ పార్టీలోకి వచ్చారు.

## డ్రైవర్లు ఏకాగ్రత, భద్రత పాటించాలి

డ్రైవర్లు ఏకాగ్రత, భద్రత, వేగ నియంత్రణలను పాటిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ఆర్టీసీ నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యచంద్రరావు సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నెల్లూరు రెండవ డిపో గ్యారేజీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు రీజియన్ పరిధిలో టైర్లు, స్టోర్, వర్క్‌షాపు నిర్వహణకు రూ.40 కోట్లు పైగా ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ప్రమాద రహిత రీజియన్‌గా నెల్లూరు జిల్లాను నిలుపుదామన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవాణాశాఖ నెల్లూరు జోన్ ఉపకమీషనర్ మోహన్ మాట్లాడుతూ ప్రమాదాల్లో చనిపోతున్న వారి సంఖ్య పెరుగుతోందని, రాష్ట్రంలో మూడవ స్థానంలో ఉందన్నారు. డిప్యూటి సిటీయం చంద్రశేఖర్, డిప్యూటి సిఎంఈ శేషయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటి ఇ.విజయ్‌కుమార్, విజిలెన్స్ ఆఫీసర్ చెంచురెడ్డి, డిపో మేనేజర్లు షమీం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## అక్కినేని మృతికి సింహపురి సాహితీ సమాఖ్య సంతాపం

ప్రఖ్యాత తెలుగు సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు మృతికి సంతాపం ప్రకటిస్తూ దర్గామిట్ట సుజాతమ్మ కాలనీలోని సాహితీ ఎన్‌క్లేవ్ అపార్టుమెంటులో ఈ నెల 22న సింహపురి సాహితీ సమాఖ్య సభ్యులు నివాళులర్పించారు. సమాఖ్య అధ్యక్షులు గణపం రాజగోపాల్‌రెడ్డి, కార్యదర్శి గుర్రాల రమణయ్య, ఉపాధ్యక్షులు సిరిమిళ్ళ కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి రావుని శారద, సభ్యులు పి.చెంచయ్య, సర్వేపల్లి ప్రభాకర్, ఓ.నాగలక్ష్మి, వెంకటరత్నం, సర్వేపల్లి రామ్మూర్తిలు అక్కినేని నటనాకౌశల్యాన్ని వ్యక్తిగత ఔన్నత్యాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ సాహిత్యంలో ఆయన పాత్ర గురించి మాట్లాడి ఆయన మరణం తెలుగు వారికి తీరని లోటని తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

# నెల్లూరు కబుర్లు

## జిల్లాలో జగన్ శంఖారావం



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి సమైక్యశంఖారావ యాత్ర ఈనెల 28 నుండి జిల్లాలో జరిగే అవకాశముంది. ప్రస్తుతం ఆయన యాత్ర చిత్తూరుజిల్లాలో జరుగుతుంది. మూడు రోజులపాటు జిల్లాలోని 10అసెంబ్లీ నియోజకవర్గాలలో జరిగేలా సమైక్యశంఖారావయాత్రకు పార్టీ వర్గాలు ప్లాన్ చేస్తున్నాయి. గతంలో ఓదార్పుయాత్రకు, ఆ తర్వాత కోవూరు ఉపఎన్నికల ప్రచారానికి జగన్ రావడం జరిగింది. జగన్ సమైక్యశంఖారావం యాత్రతో జిల్లా పార్టీలోని అన్ని వర్గాలు ఒకే దారికి రావడంతో పాటు కేడర్ మరింత ఉత్సాహంగా పనిచేసే అవకాశముంది.

## ఎస్పీకి పదోన్నతి?



జిల్లా ఎస్పీ వి.వి.యస్.రామకృష్ణకు త్వరలో డిఐజిగా పదోన్నతి రానుంది. దాంతో ఆయన బదిలీ కూడా ఖాయమే. బి.వి.రమణకుమార్ తర్వాత జిల్లాకు ఎస్పీగా వచ్చిన రామకృష్ణ గాడి తప్పిన జిల్లా పోలీసు వ్యవస్థను దారిలో పెట్టాడు. పోలీసు సిబ్బంది చేత ఒళ్లు వంచి పని చేయిస్తున్నాడు. పోలీసు అధికారుల చేత పరుగులు పెట్టిస్తున్నాడు. ఇప్పుడు వచ్చే ఎస్పీ సార్వత్రిక ఎన్నికలను చూడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అనువైన ఎస్పీని వేయించుకోవడానికి అధికారపార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారు.



ఈ నెల 20వ తేదీన నెల్లూరు కలెక్టరేట్‌లో 25వ రహదారి భద్రతావారోత్సవాల ప్రచారరథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ వివియస్ రామకృష్ణ తదితరులు

## తెలంగాణ బిల్లును అడ్డుకోండి



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న జయకుమార్‌రెడ్డి అనుచరులు

నెల్లూరులోని ప్రభుత్వ కార్యాలయాలలో ఈనెల 20న ఆనం జయకుమార్‌రెడ్డి అనుచరులు తెలంగాణ బిల్లును వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శనలు చేసారు. నగరపాలకసంస్థ కార్యాలయం, జిల్లా ప్రజాపరిషత్, జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఎంఆర్ఓ, ఆర్డీఓ కార్యాలయాలు, డి.ఆర్.డి.ఏ, ఫైర్ సర్వీస్, టెలిఫోను కార్యాలయాలు, జిల్లా ప్రభుత్వ పశువైద్యశాల ముందు తెలంగాణ బిల్లును అడ్డుకోండి – తెలంగాణ బిల్లుకు వ్యతిరేకంగా పోరాడండి అని ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ సమైక్యాంధ్ర కరపత్రాలను పంపిణీ చేసారు. కార్యక్రమంలో కొర్లగుంట బాబునాయుడు, ఆర్ఎస్ఆర్, జి.శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లుయాదవ్, ఉజ్వల్‌యానాదిరెడ్డి, కృపారావు, రియాజ్, గాల్లపాటి విజయకుమార్, బుజ్జయ్య,కోటి నాగేంద్ర, రఘురామయ్య, భరత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## శశిధరూర్ తీరుకు నిరసనగా ధర్నా

కేంద్రమంత్రి శశిధరూర్ తీరుకు నిరసనగా భారతీయ జనతా మహిళా మోర్చ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేది నెల్లూరు విఆర్‌సి సెంటర్ వద్ద ధర్నా, దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షురాలు అన్నాబత్తిన శాంతమ్మ మాట్లాడుతూ పాకిస్థాన్‌కు చెందిన ఓ మహిళతో కేంద్రమంత్రి అక్రమసంబంధం పెట్టుకోవడమే కాక మన దేశ రహస్యాలు ఎన్ని బయట పెట్టారోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ లేదంటూ ధ్వజమెత్తారు. శశిధరూర్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి సస్పెండ్ చేసి సీబీఐకి కేసు అప్పగించి ఆయన్ను అరెస్టు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో అలీయ, భాగ్యలక్ష్మి, ఖాసింబీ, రిజ్వానా, సీతమ్మ, బుజ్జమ్మ, ఝాన్సీ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## శిరిడిసాయికి నృత్య నీరాజనం



నెల్లూరు, గాంధీనగర్‌లోని శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల 19వ తేది రాత్రి చిన్నారులు గీతావైష్ణవి, పావని, కిరణ్మయిలు శిరిడిసాయికి నృత్య నీరాజనాన్ని అర్పించారు. శ్రీ గురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రి నేతృత్వంలో చిన్నారులు భరతనాట్య ప్రదర్శనలు చేసి భక్తులను అలరించారు. మందిర అధ్యక్షుడు మన్నెం అమరనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

నృత్య కార్యక్రమం అనంతరం బాబా వారి పల్లకీసేవ వైభవంగా జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శ్రీ బాబా వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

## అమీర్‌జాన్‌కు జాతీయస్థాయి అవార్డు

నెల్లూరుకు చెందిన చిత్రకారుడు షేక్ అమీర్‌జాన్ జాతీయస్థాయి జ్యూరీ అవార్డును సాధించారు. అమలాపురంలో ఈ నెల 19వ తేది కోనసీమ చిత్రకళాపరిషత్ నిర్వహించిన 24వ జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో అమీర్‌జాన్ గీసిన "కోడిపుంజును పట్టుకున్న పల్లెటూరి అమ్మాయి" చిత్రానికిగాను ఈ అవార్డును అందుకున్నారు. శిల్పి డి.రాజ్‌కుమార్ ఉడయార్ నుంచి ఈ అవార్డును అందుకున్నట్లు అమీర్‌జాన్ తెలిపారు.

## ఒలింపియాడ్‌లో రెయిన్‌బో



జాతీయ స్థాయి సైన్స్ ఒలింపియాడ్ పరీక్షలలో నెల్లూరులోని రెయిన్‌బో స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచారు. మొదటిదశ పరీక్షలలో రాష్ట్రస్థాయిలో వి.సాయితేజష్ 5వర్యాంకు, సాధనకృష్ణ 12వ ర్యాంకు, కశ్యప్ 124వ ర్యాంకు, ప్రీతమ్‌శంకర్ 131వ ర్యాంకును సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ అరుణలు అభినందించారు.

- ఫ్లెక్సీల గోల

## అటో... ఇటో... తేలిపోవాలి

ఏ నాయకుడు ఏ పార్టీ తీర్థం పుచ్చుకుంటాడో, ఒక పార్టీ నుంచి మరోక పార్టీలోకి ఎప్పుడు దూకుతాడో అర్థం కాని పరిస్థితిలో ప్రజలు తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం ఫ్లెక్సీల గోల ఎక్కువైంది. అర్థం గాని రీతిలో ఫ్లెక్సీలు వెలుస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో కార్యకర్తలు తల గోడకేసి కొట్టుకుంటున్నారు. తాజాగా నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి కాంగ్రెస్‌పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నాడంటూ వార్తలు వినవస్తున్న నేపథ్యంలో ఈనెల 19వ తేదిన రాజీవ్ గృహకల్ప అభివృద్ధి కార్యక్రమాల వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలో ఈ విషయం ప్రస్ఫుటంగా తెలుస్తోంది. శ్రీధరకృష్ణారెడ్డి పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆయన ఫోటో మధ్యలో ఉండగా ఇరువైపులా శ్రీకృష్ణుడిగా వున్న ఎన్టీఆర్ ఒకవైపు మెగాస్టార్ చిరంజీవి మరోవైపు ఉన్న ఫ్లెక్సీలను చూసి ప్రజలు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు.

### పిచ్చి వెర్రితలలువేస్తోంది...

సమాజంలో ప్రజలకు సంబంధించి ఏ సమస్యలులేనట్లు ఇటు మునిసిపల్‌శాఖ వారుగాని, పార్టీల నాయకులుగాని పట్టించుకోకుండా సిల్లీగా గల్లీల్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలపై రచ్చ చేసుకోవడంపై నగర ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారు. పిచ్చి వెర్రితలలు వేసినట్లు ఈ మధ్యకాలంలో నగరంలో ఏ గల్లీ, సిల్లీ పాయింట్లలో చూసినా దేనికి పనికిరాని, తల మీద రూపాయి పెడితే పైసాక్కూడా కొరగాని చోటానాయకుల జన్మదిన శుభాకాంక్షల ఫ్లెక్సీలు తమ స్వంత ఖర్చులతో ఎవరో ఒకరు అభినందిస్తున్నట్లు పేర్లు, ఫోటోలు వేయించుకుంటున్నారు. తమ మెహర్బానీ కోసం ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలను ఏర్పాటుచేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. అతి వద్దని సూచిస్తున్నారు.

## నందమూరికి నివాళులర్పించిన సింహపురి



ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న తెలుగుదేశం నాయకులు

మాజీ ముఖ్యమంత్రి నటరత్న నందమూరి తారకరామారావు 18వ వర్ధంతిని ఈ నెల 18వ తేది నగరంలోని పలు ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేసారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ధర్మవరం సుబ్బారావు, శింగంశెట్టి రవిచంద్ర, నూనె మల్లికార్జున్‌యాదవ్, అంచెల వాణి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిలారి వెంకటస్వామినాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. లక్ష్మీపురంలో కిన్నెర ప్రసాద్, ఎన్టీఆర్ నగర్‌లో కొల్లూరు బాలకృష్ణచౌదరి, ప్రగతినగర్ సెంటర్‌లో జలదంకి సుధాకర్, ఉస్మాన్‌సాహెబ్‌పేటలో వైవి సుబ్బారావు, మూలాపేటలో నూనె మల్లికార్జున్‌యాదవ్, రామలింగాపురం సెంటర్‌లో శ్రీనివాసులునాయుడు, డైకాస్‌రోడ్డు సెంటర్‌లో ఆసిఫ్‌బాషా, శెట్టిగుంటరోడ్డులో చమ్మండి రాము, మూలాపేట శివాలయం సెంటర్‌లో పెద్దినేని రమేష్‌నాయుడు తదితర ప్రాంతాల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పిల్లలకు పండ్లు, బిస్కెట్లు, హాట్‌బాక్స్‌లు పంపిణీ చేసారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.


శెట్టిగుంటరోడ్డు వీవర్స్ కాలనీలో నందమూరి అభిమానుల ఆధ్వర్యంలో రక్తదానం జరిగింది.

## కంభంకు అస్వస్థత

ఉదయగిరి మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి అనారోగ్య కారణంగా బొల్లినేని ఆసుపత్రిలో ఉంటున్నారు. ఆయనకు ఇటీవల ఛాతి నొప్పి రావడంతో ఆసుపత్రిలో చేర్చారు. గుండెకు రక్తం సరఫరా చేసే రక్తనాళాలలో బ్లాక్‌లను గుర్తించి యాంజియోగ్రామ్ నిర్వహించి స్టంట్ వేసారు. విజయరామిరెడ్డికి తాగుడు, సిగరెట్లు అలవాట్లు లేవు. మెట్ట ప్రాంతంలో పుట్టిన మట్టి మనిషి. కాకపోతే పాన్‌పరాగ్ పొట్లాలు ఎక్కువుగా నమలడమే ఆయన ఆరోగ్యానికి చేటు తెచ్చింది. ఇప్పటికైనా వాటిని తగ్గించుకుంటే మంచిది.

## ఎమ్మార్వోకు గుండెపోటు

నెల్లూరు మండల తహశీల్దార్ నరసింహారావు ఇటీవల గుండెపోటుకు గురయ్యారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహిస్తుండగా ఆ సమావేశంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే ఆయనను ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉంది. అయితే కొద్దిరోజులు ఆయనకు విశ్రాంతి అవసరం కావడంతో కోవూరు తహశీల్దార్ సాంబశివరావును నెల్లూరుకు ఇన్‌ఛార్జ్ తహశీల్దార్‌గా నియమించారు.




కావలి నియోజకవర్గంలో నిర్వహిస్తున్న దీవెనయాత్రలో భాగంగా ఈ నెల 18వ తేదీన మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న కావలి నియోజకవర్గ వైయస్సార్సీపి సమన్వయకర్త రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

# నేత్ర పర్వంగా జగన్నాథుని రథయాత్ర



అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేది నెల్లూరులో జగన్నాథుని రథయాత్ర నేత్రపర్వంగా సాగింది. నెల్లూరు రంగనాయకులపేట శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం వద్ద విశేషపుష్పాలతో రథాన్ని శోభాయమానంగా అలంకరించారు. బలరామకృష్ణులు సుభద్రాదేవి విగ్రహాలను రథంలో కొలువు తీర్చారు. ఇస్కాన్ అర్చక బృందం ఆధ్వర్యంలో జగన్నాథునికి 51 రకాల నైవేద్యాలను సమర్పించారు. హరేరామ..హరేకృష్ణ అంటూ భక్తులు భగవన్నామస్మరణ చేసారు. ఒంటెలు, గుర్రాల విన్యాసాలు, కోలాటాలు, నృత్యప్రదర్శనలు నడుమ రథయాత్ర బయలుదేరింది. రంగనాయకులపేట నుంచి ప్రారంభమైన రథయాత్ర సంతపేట సెంటర్, ఏసీసెంటర్, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, విఆర్‌సి సెంటర్, ఆర్టీసీ మీదుగా కస్తూరిదేవి గార్డెన్స్‌కు చేరుకుంది. ఇక్కడ జగన్నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షుడు సుఖదేవస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి కుంభహారతులు, 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. కేరళ సంప్రదాయ నృత్యాలు అలరించాయి. రథయాత్రలో సౌత్‌ఇండియా జీబీసీ భానుమహరాజ్ ప్రభు, ఫ్రాన్స్, జపాన్, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన ఇస్కాన్ ప్రతినిధులతో పాటు నెల్లూరు అధ్యక్షుడు సుఖదేవస్వామి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అబ్దుల్ అజీజ్, అధికారులు, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



జపాన్ ప్రతినిధి నుండి జ్ఞాపికనందుకుంటున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

## వేమిరెడ్డి దాతృత్వం

ప్రముఖ పారిశ్రామికవేత్త, వైయస్సార్సీపి నాయకుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇస్కాన్ మందిరానికి రూ.2 లక్షలు విరాళాన్ని అందజేసారు. జగన్నాథ రథయాత్రలో ప్రసాదాల పంపిణీ కోసం ఈ మొత్తాన్ని ఇస్కాన్ అధ్యక్షులు సుఖదేవస్వామి స్వీకరించారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని జ్ఞాపికతో ఇస్కాన్ జపాన్ ప్రతినిధి భాను స్వామి మహరాజ్ సత్కరించారు.

# మానసిక ధృడత్వం కోసం పోలీస్ డీ మొబిలైజేషన్ పెరేడ్



ప్రసంగిస్తున్న ఎస్పీ రామకృష్ణ

నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ఈనెల 18న డీమొబిలైజేషన్ పెరేడ్‌ను జిల్లా ఎస్పీ వివియన్ రామకృష్ణ ప్రారంభించారు. ఇందులో ఏఆర్ సిబ్బంది 763మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రామకృష్ణ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలు, ప్రస్తుతం జరుగుతున్న పోరాటాలలో కీలకపాత్ర పోషించాల్సి వుందని వీటన్నింటిలో సమర్ధవంతంగా పనిచేసే మానసిక ధృడత్వాన్ని పెంపొందించుకొనేందుకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందన్నారు. సమాజంలో పోలీసుల పాత్ర, ఎస్కార్టు విధులు తదితరాల గురించి సిబ్బందికి వివరించారు. జిల్లాలో పనిచేస్తున్న పోలీసుసిబ్బంది కుటుంబాలకు, హోమ్‌గార్డుల కుటుంబసభ్యులకు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

ఫిబ్రవరి 14 వరకు జరుగనున్న డీమొబిలైజేషన్ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉద్యోగ నిర్వహణలో వత్తిడిని అధిగమించడానికి ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ సంస్థ ద్వారా యోగా తరగతులు నిర్వహిస్తారని జిల్లా అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఐఆర్‌ఎస్ మూర్తి పర్యవేక్షిస్తారని తెలిసింది. రాష్ట్రంలోనే మొట్టమొదట నెల్లూరులోనే ఈ డీమొబిలైజేషన్ పెరేడ్ ప్రారంభించడం జరిగిందని తెలిసింది. కార్యక్రమంలో డీఎస్పీలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

● అదే తుది పయనం...

# మూసిన కనులు మూసినట్లే





*ప్రయాణంలో ప్రాణాలకు గ్యారంటీ లేకుండాపోతుంది. నిద్రమత్తులోనే పోతున్న ప్రాణాలెన్నో. తెల్లారక ముందే తెల్లవారిపోతున్న జీవితాలెన్నో... విమానమెక్కితే ఎక్కడ కూలుతుందో తెలియదు... రైలు పెట్టెలు ఎక్కడ తగులబడతాయో అర్ధంకాదు... బస్సులు తిరగబడతాయో, తగలబడుతాయో, లోయల్లో కూలబడతాయో అంతుబట్టదు. ప్రయాణం చేస్తున్నంత సేపు ప్రాణాలు పిడికిట్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి.*

నాగపూర్ వద్ద షిర్డి వెళుతూ లోయలో పడ్డ ఎస్‌విఆర్ ట్రావెల్స్ బస్సు... బెంగుళూరు నుండి హైదరాబాద్ వెళుతూ పాలెం వద్ద దగ్ధమైన జబ్బార్‌ట్రావెల్స్ బస్సు... తాజాగా నెల్లూరు నుండి బెంగుళూరు వెళుతూ హోస్‌కోట వద్ద డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడ్డ రాజేష్ ట్రావెల్స్ బస్సు.

ప్రైవేట్ బస్సుల ప్రమాదాల పరంపర కొనసాగుతూనే ఉంది. 20వ తేదీ తెల్లవారుజామున 5.30గంటల ప్రాంతంలో బెంగుళూరు సమీపంలోని హోస్‌కోట వద్ద నెల్లూరు నుండి బెంగుళూరు వెళ్తున్న రాజేష్ ట్రావెల్స్ ఓల్వోబస్సు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడిన దుర్ఘటనలో 5మంది మృతి చెందగా 29మంది గాయపడ్డారు. మృతులలో నెల్లూరు చిన్నబజారుకు చెందిన పెళ్ళకూరు విజయకుమార్, బి.వి.నగర్‌కు చెందిన మానసకుమార్(6), నేతాజీనగర్‌కు చెందిన అనూషా(25), గూడూరు రాజావీధికి చెందిన ప్రదీప్, పొదలకూరు మండలం వావింటపల్లికి చెందిన చిన్నం ప్రసాద్‌లు ఉన్నారు. మృతులంతా బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా, బిల్డర్‌లుగా ఉంటున్నారు. వీళ్లంతా సంక్రాంతి పండుగకు సొంత గ్రామాలకు వచ్చి 19వ తేదీ రాత్రి తిరుగు పయనమయ్యారు. ఆరోజు రాత్రి నెల్లూరులోని మద్రాసు బస్టాండ్ వద్ద వీరికి బంధువులు వీడ్కోలు పలికారు. అదే వీరికి చివరి వీడ్కోలు అయ్యింది. ఆరోజు రాత్రి నిద్రపోయి లేచేసరికి బస్సులో వెళ్లిన తమవారి మరణవార్తే బంధువులకు తొలివార్త అయ్యింది.

# రోటరీ ఐ ఫౌండేషన్‌కు "దొడ్ల" విరాళం



పిల్లలకు పోలియోచుక్కలు వేస్తున్న రోటరీ సభ్యులు

పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న నెల్లూరు రోటరీక్లబ్ వారు రోటరీ క్లబ్ సెంటర్, గాంధీబొమ్మ సెంటర్‌ల వద్ద పల్స్‌పోలియో శిబిరాలు నిర్వహించారు.

నెల్లూరు రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ క్లబ్ సభ్యులు రొటేరియన్ డి.ఎస్.రెడ్డి ద్వితీయ వర్ధంని పురస్కరించుకుని వారి కుటుంబసభ్యులు రోటరీ "ఐ" ఫౌండేషన్‌కు యాభైవేల చెక్కును అందించారు. రోటరీ "ఐ" ఫౌండేషన్ తరపున ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించి మందులు ఉచితంగా అందచేయుటకు ప్రతి ఏటా డి.ఎస్.రెడ్డి వర్ధంతి రోజున 50వేల చెక్కును రోటరీ 'ఐ' ఫౌండేషన్‌కు ఇవ్వడానికి వారి కుటుంబసభ్యులు నిర్ణయించారని వారి కుమారుడు రోటరీ మాజీ గవర్నర్ దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష కార్యదర్శులు టి.శేఖర్, కె.ప్రతాప్‌కుమార్, రోటరీ పల్స్‌పోలియో గవర్నర్ ఎస్.రాఘవేంద్రషెట్టి, ఐ ఫౌండేషన్ అధ్యక్షులు పి.శ్రీనివాసులురెడ్డి ఇతర రొటేరియన్స్ పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణ కరువైంది




వైఎస్సార్సీపీ నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి డివి జన్‌బాట కార్యక్రమంలో భాగంగా ఈనెల 20న నెల్లూరు పొదలకూరురోడ్డులోని లేక్ వ్యూకాలనీ, బి బ్లాక్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికీ మహిళలపై అత్యాచారాలు పెరిగి పోయాయని స్త్రీని ఆదిశక్తిగా, భారతమాతగా ఆరాధించే భరతభూమిలో మహిళలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. మొన్న నెల్లూరులో భార్గవి, నిన్న ఢిల్లీలో నిర్భయ, నేడు ముంబయిలో అనూహ్య ఇలా ప్రతిరోజూ మహిళలపై జరుగుతున్న దుర్మార్గపు అరాచకాలు, హత్యలు భరతజాతి భవిష్యత్తుకే గొడ్డలిపెట్టు అని అన్నారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు సరిగా అమలు కావడం లేదని, ఆ చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయగలిగితేనే మహిళలకు తగిన రక్షణ ఏర్పడుతుందని తెలిపారు. మహిళలకు రక్షణ కల్పించడంలో రాజకీయ నాయకత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని, సమర్ధ నాయకత్వం, అంకితభావంతో పనిచేసే నాయకత్వం వున్నట్టయితే మహిళలు స్వేచ్ఛగా సమాజంలో మనగలుగుతారని పేర్కొన్నారు. అచిరకాలంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చినవెంటనే వైయస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా మహిళల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్ కిరణ్, శైలజ, అనుపమ, హసీనమ్మ, అజీమ్, రియాజ్, విజయ్, అశోక్, సర్దార్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

శ్రీను గల్పిక 989

# ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో టీ అమ్ముకున్న రాహుల్

అది ఉష్ణోగ్రతలు 4డిగ్రీలకు, రాజకీయాలలో విలువలు –4 డిగ్రీలకు పడిపోయిన నాయకులుంటున్న దేశ రాజధాని ఢిల్లీ మహానగరం. ఆ నగరంలో రైల్వేస్టేషన్. ఉదయం 10గంటల సమయం. తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య అంతకుముందు రోజే ఢిల్లీ వచ్చారు. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీని కలిసి పక్కరోజు రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో చెన్నై వెళ్లడానికి రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అప్పుడే ఫ్లాట్‌ఫాం మీద రైలు ఆగింది. ఆయన ఎక్కి ఏసి భోగీలో కూర్చున్నాడు. అంతలో ఛాయ్... ఛాయ్... అంటూ ఓ యువకుడు టీ అమ్ముతూ వస్తున్నాడు. కొందరు ప్రయాణీకులు అతని వద్ద టీ కొని చేతిలో చిల్లర పెడుతున్నారు. రోశయ్య దూరం నుండి ఆ యువకుడిని చూసాడు. అతనిని ఎక్కడో చూసినట్లుగా రోశయ్యకు అనిపించసాగింది. అడిగినవారికి టీ ఇస్తున్న సీన్ చూస్తుంటే టీ అమ్మేపనికి అతను కొత్తగా వచ్చాడని పించింది రోశయ్యకు. ఆ యువకుడు భోగీలో టీ అమ్ముతూ రోశయ్య బెర్త్ వద్దకు వచ్చి... ఏం తాతా టీ కావాలా అని అడిగాడు. రోశయ్య బనియన్ జేబులో నుండి రూపాయిబిళ్ల తీసి... ఒక టీ ఇవ్వు బాబూ అన్నాడు. ఆ యువకుడు ఉండి... టీ పదిరూపాయలు తాతయ్యా అని చెప్పాడు. దానికి రోశయ్య... అదేం అన్యాయం బాబు... నేను పాతికేళ్ల క్రితం ఇదే రైల్వేస్టేషన్‌లో టీ తాగినప్పుడు రూపాయి తీసుకున్నారు. ఇప్పుడూ రూపాయే ఇస్తాను. ఎందుకంటే అప్పుడెంత టీ ఇచ్చారో, ఇప్పుడూ అంతే టీ ఇచ్చారు కదా అని అన్నాడు. రోశయ్యతో వాదించి ఇక లాభం లేదనుకున్న ఆ యువకుడు ఆయనకు టీ గ్లాస్ అందించి ఆయన ఇచ్చిన రూపాయిని జేబులో వేసుకున్నాడు. రోశయ్య టీ తాగుతూ... నిన్నెక్కడో చూసినట్లుంది బాబూ... ఎవరి బిడ్డవు నువ్వు అని అడిగాడు. దానికి ఆ యువకుడు... నేను మాజీప్రధాని రాజీవ్‌గాంధీ, యూపిఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీలకు పుట్టిన బిడ్డను... రాహుల్‌గాంధీని అంటూ నెత్తిమీద టోపీ తీసాడు. ఆ పేర్లు వినగానే రోశయ్య ఉలిక్కిపడ్డాడు. టీ తాగుతుండడంతో ఒక్కసారిగా పొలమారింది. కొద్దిసేపు తత్తరపాటుకు గురయ్యాడు. కొద్దిసేపటికి తేరుకుని... బాబూ ఇదేం అన్యాయం... నువ్వు టీ అమ్మితే నేను తాగడమా... అయ్యో దేవుడా ఎంత పాపం చేసాను. అయినా ఈ రైలేంటి, ఈ రైల్లో నువ్వు టీ అమ్మడమేంటి, భగవంతుడా ఇది కల అయితే ఎంత బావుండు... అయినా నీకు టీ అమ్మాల్సినంత కష్టమేమొచ్చింది బాబు... ఒకవేళ అమ్మ నిన్ను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించనంత మాత్రాన అలిగి ఇలా వచ్చి టీ అమ్ముకోవడమేనా అంటూ ఆవేదన చెందసాగాడు. అప్పుడు రాహుల్ రోశయ్యను ఓదారుస్తూ... తాతా అదేం లేదు. ఇదంతా మన పార్టీ నిర్ణయం ప్రకారమే జరుగుతుంది. మొన్న జరిగిన ఏఐసిసి సమావేశం గురించి నీకు తెలియదు కదూ... చెబుతా విను అంటూ అప్పుడే అటుపోతున్న మురుకులు అమ్మే హాకర్ నుండి ఓ మురుకును తీసుకుని రోశయ్య కళ్లముందు పెట్టి చక్రంలా తిప్పుతూ ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్లాడు.

అది ఏఐసిసి సదస్సు ప్రాంగణం. వివిధ రాష్ట్రాల నుండి కాంగ్రెస్ ప్రతినిధులు వస్తున్నారు. అందరి చేతుల్లోను చిడతలు, మద్దెల దరువు వంటి వాయిద్యాలున్నాయి. సోనియా, రాహుల్ భజన కార్యక్రమ ఏర్పాట్లు బాగానే చేసారనిపించసాగింది అక్కడ వాతావరణం. వచ్చిన అతిథులందరికీ కూడా వి.హెచ్.హనుమంతురావు, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, మధుయాష్కీలు టీ, కాఫీలు అందజేస్తున్నారు. ప్రతినిధులందరికీ అజెండా కాపీలు అందజేసారు. మొదట ప్రార్థనాగీతంగా 'సోనియా స్తోత్రం' వుంది. తర్వాత రాహుల్ రాజకీయ వీరగాథను బుర్రకథగా చెప్పే ఐటం వుంది. పార్టీకి సోనియాగాంధీ చేసిన సేవలను డాక్యుమెంటరీగా చూపించే అంశం మూడోదిగా వుంది. నాలుగోదిగా రాహుల్‌ను ప్రచారసారధిగా ప్రకటించడం, ఐదో అంశంగా 'సోనియా కీర్తిసుధ' హరికథాగానం, చివరిగా పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే రాహుల్ గాంధీని ప్రధానిగా తీర్మానించడం, ఓడిపోతే మన్మోహన్‌సింగ్‌ను బాధ్యుడిని చేస్తూ తీర్మానం చేయాలని చేర్చారు. అజెండా ప్రకారం సమావేశం ప్రారంభమైంది. రాహుల్‌గాంధీ పొగడడానికి నాయకులు పోటీపడ్డారు. రాహుల్‌ను ఎవరు బాగా పొగిడితే వారికి ప్రథమబహుమతిని ఇస్తామని జనార్ధన్ ద్వివేది ప్రకటించారు. దీంతో వివిధ రాష్ట్రాల ప్రతినిధుల మధ్య రాహుల్ భజనపై రసవత్తర పోటీ నడిచింది. ఈ పోటీలో తెలంగాణ ప్రతినిధులు మొదటి స్థానంలో నిలిచి బహుమతి అందుకున్నారు. తర్వాత జైపాల్‌రెడ్డి వేదికనెక్కి అవతల బీజేపీవాళ్లు నరేంద్ర మోడీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించారు. మనం రాహుల్ బాబును ప్రధాని అభ్యర్థిగా ప్రకటించాలని కోరాడు. అప్పుడు అంబికాసోని లేచి... రాహుల్‌బాబును ఇప్పుడు ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడం ఏమిటి... ఆయన పుట్టినప్పుడే మన పార్టీకి ప్రధాని అభ్యర్థి అనుకున్నాం కదా అని చెప్పింది. తర్వాత గులాంనబీ ఆజాద్ లేచి... అవతల నరేంద్ర మోడీ టీ అమ్ముకునే బ్రాండ్‌తో దూసుకుపోతున్నాడు. ఈమధ్య ముంబైలో కూడా నరేంద్ర మోడీ సభకు 10వేలమంది ఛాయ్ వాలాలు వచ్చారు. ఈమధ్య ఓ జ్యోతిష్యుడిని సంప్రదించాను. ఆయన టీ అమ్ముకునే వ్యక్తే దేశప్రధాని అవుతాడని చెప్పారు. ఇప్పుడు మన పరిస్థితేంటి అని వాపోయాడు. అప్పుడు రాహుల్... అవును టీ అమ్మే వ్యక్తే ప్రధాని అవుతాడు. ఇది నిజం. పార్టీ కోసం, మీ కోసం నేను రైల్వేస్టేషన్‌లో టీ బాయ్ అవతారం ఎత్తుతానని సభాముఖంగా ప్రకటించాడు. తమ కోసం టీ అమ్మడానికి కూడా సిద్ధమైన రాహుల్ త్యాగానికి కాంగ్రెస్ నాయకుల గుండెలు బరువెక్కాయి. కళ్లల్లో కన్నీళ్లు వరదలా ప్రవహించసాగాయి.

★★★★★

ఇక్కడితో ఫ్లాష్‌బ్యాక్ అయిపోయింది. అప్పటికే రోశయ్య కళ్లల్లో కన్నీళ్లు... ఆయన రాహుల్‌ను గట్టిగా గుండెలకు హత్తుకుని... శెభాష్ బాబూ శెభాష్... నీలాంటి వాళ్లే దేశానికి కాకపోయినా మన పార్టీకి అవసరం అని అభినందించాడు.

కదంబం

## దుఃఖం

సిహెచ్.వి.బృందావనరావు,
విజయవాడ. 9963399189

దుఃఖమంటే
గడ్డకట్టిన చీకటి
కన్నీటి ముక్కలై
ముక్కు ముక్కుగా రాలుతున్న
ఏడ్పుల కవాతు

అడుగున అగ్నికీలలెగసే
దబ్బనాల శయ్యమీద
తిరుగమోతలౌతున్న
పాల వరికంకుల
గుండెకోత

కత్తి వాదరల జల్లెడలో
అనుభవాల్ని జల్లించి
నిప్పుకణికల చేటల్లోకి
తూర్పారపట్టే
రాకాసి సాము గరిడీ

వల్మీక వాల్మీకాల్లోంచి
గరళ పూత్కార
శోకశ్లోకాలనుమిసే
యుద్ధకాండల
నిశ్శబ్ద ఝుంఝు

దుఃఖమంటే ఒక
పరచుకున్న
తిమిర శయ్యా వైశాల్యం.
పగలబోతున్న
అగ్నికొండ కడుపులో
రగిలిపోతున్న
లావా ఎగసిపాటు

దుఃఖమంటే
కోపానికి భూతకాలం
రేపటి తిరుగుబాటుకు
నేడు పడే పురిటినొప్పుల
చప్పళ్ళేని పెనుకేక!

## వాకర్స్ జిల్లా – 203 గవర్నర్ నేతాజీ సుబ్బారెడ్డి



నెల్లూరు శ్రీనివాస అగ్రహారం లోని యం.సి.యస్ కల్యాణ మండపంలో ఈనెల 19న వాకర్స్ జిల్లా –203 కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా నెల్లూరు నగర శాసన సభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడుతూ నేటి సమాజంలో చాలా మంది ప్రజలు శారీరక వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, ముఖ్యంగా విద్యార్థులను తల్లిదండ్రులు కేవలం చదువుకే పరిమితంచేసి ఆటపాటలకు దూరం చేస్తున్నారన్నారు. అందువల్ల వారు పెద్దయిన తర్వాత నడక అనేది లేకుండా వాహనాలపై ప్రయాణిస్తూ ప్రతి చిన్న పనికి కొద్ది దూరం కూడా నడవలేక పోతున్నారని అన్నారు. పరిసర ప్రాంతాల్లోని పార్కులు లేదా ఇతర ప్రదేశాల్లో నడకకు కావలసిన ఏర్పాట్లు గురించి వాకర్స్ అసోసియేషన్ తమ దృష్టికి తీసుకువస్తే వాటిని వెంటనే చేయిస్తానని తెలిపారు. ఏసినగర్ పార్కు అభివృద్ధికి చేస్తున్నట్లు తెలిపారు. నేతాజీ ఫైలట్‌స్కూలు అధినేత యం.వి.సుబ్బారెడ్డి వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా–203 గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేసి మాట్లాడుతూ మన ఆరోగ్యమే కుటుంబ అభివృద్ధికి కారణమని, కుటుంబ అభివృద్దే సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. నడకతో బిపి, షుగర్, గుండెజబ్బు మొదలగు జబ్బులను కొంత మేర నివారించుకొనే అవకాశం కలదన్నారు. నెల్లూరు, గుంటూరు, ప్రకాశంజిల్లాలలో పలుచోట్ల నడకపై అవగాహన కార్యక్రమాలు చేపడుతుందని, డాక్టర్లచే ఉచిత చికిత్సా శిబిరాలు ఏర్పాటుచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు పి.వి.పి.రాజు, మాజీ అధ్యక్షులు డా॥యం.వి.రావు, ఉపాధ్యక్షులు పిఆంజనేయులు, మాజీ అధ్యక్షులు బి.మనోహర్‌రెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు ఎ.శ్రీదేవి జిల్లా మాజీ గవర్నర్లు దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, డా॥కె.అంకిరెడ్డి, మాజీ కార్పొరేటర్ చాట్ల నరసింహారావు పాల్గొన్నారు.

## నడక నా ఆయుధం

–చిన్ని నారాయణరావు
94402 02942

నడక నా తల్లి
నను ముందుకు నడిపించే కల్పవల్లి
నడక మన సంస్కృతి
మానవుడి పురోగమనానికి ఆకృతి


రేపటి సాధానికి నేటి పునాది నడకే
స్తబ్ధతను, నిశ్శబ్ధాన్ని పారద్రోలేది నడకే

పాదయాత్ర ఓ చైతన్యానికి నిలువెత్తు ప్రతీక
ఉజ్వల సమరానికి, మహోద్యమానికి
నడకే పతాక

ఓ ప్రభంజనానికి వేదుక నడకే
పెద్ద పరుగు పందెమైనా అడుగుతోనే ఆరంభం
నడకతోనే మానవ జీవిత ప్రస్థానం
నడకే ముమ్ముందుకు నడిపించే వైభవ్యగీతం
నడకతోనే మానవజాతి పురోగమించును
నడకతోనే సముజ్వల ప్రగతి సాధించును
నడకతో గాంధీజీ స్వాతంత్ర్యం సాధించెనుగదా
మహాత్ముని సందేశం నడకే కదా
అమరజీవి హరిజనోద్ధరణ నడకతోనే కదా
వైఎస్ విసరిన పాశుపతాస్త్రం నడకే కదా
అందుకే-
నడకే విజయం వైపు నడిపించే ఆయుధం
ఆరోగ్యవంతమైన సమాజానికి దివ్యౌషధం!

## భక్తి శ్రద్ధలతో గొబ్బెమ్మ నిమజ్జనోత్సవం

నెల్లూరు పెన్నానదీ తీరంలో ఈనెల 18వ తేది గొబ్బెమ్మ తల్లి నిమజ్జనోత్సవం భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగింది. భక్తజనులతో పెన్నా తీరం పోటెత్తింది. ధనుర్మాసంలో తమ ఇళ్ల ముంగిట తీర్చిదిద్దిన రంగవల్లుల్లో గొబ్బెమ్మను పెట్టి గౌరమ్మగా పూజలు జరిపిన భక్తులు పెన్నానదీ తీరజలాల్లో నిమజ్జనం చేసారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఏటి ఒడ్డున గౌరమ్మను వుంచి గొబ్బి పాటలు పాడుతూ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేసారు. ఆడుతూపాడుతూ, గాలి పటాలు ఎగురవేస్తూ చిన్నాపెద్దా ఆనందోత్సవాలతో గడిపారు. ఏటి పండుగను పురస్కరించుకుని పెన్నాతీరానికి జిల్లాలోని పలువురు దేవతామూర్తులు తరలివచ్చి విడిది చేసారు. జొన్నవాడ కామాక్షితాయి, వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి, పెనుశిల పెంచలస్వామి, కనుపూరు ముత్యాలమ్మ, నర్రవాడ వెంగమాంబ, నెల్లూరు దర్గామిట్ట శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు, సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు, మూలాపేట శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి,



ధర్మరాజులస్వామి, నవాబుపేట మల్లేశ్వరస్వామి, రాయాజీవీధి ఆంజనేయస్వామి, స్టోన్ హౌస్‌పేట శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు విశేషాలంకారాలతో భక్తులకు దర్శనమిచ్చారు. నగర కార్పొరేషన్ కమీషనర్ జాన్‌శ్యాంసన్, దేవాదాయశాఖ జిల్లా సహాయ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఐటిఐ ప్రిన్సిపల్ పై క్రిమినల్ కేసు

నెల్లూరుజిల్లా వాకాడులోని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్, శిక్షణాధికారి, సహాయశిక్షణాధికారులపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసారు. పరీక్షల్లో పాస్ చేయిస్తామంటూ విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారనే ఆరోపణతో వీరిపై కేసు నమోదు చేసారు. వాకాడు ఐటిఐలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కోర్సును ప్రభుత్వం 2008లో ప్రారంభించింది. ఈ కోర్సులో చేరే విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండా శిక్షణ ఉచితంగా ఇవ్వాలని ఆదేశించింది. కళాశాలలో విధుల నిర్వర్తిస్తున్న కొంత మంది ఫీజుల పేరుతో విద్యార్థుల నుంచి నగదు వసూలు చేసారు. ఈ నేపథ్యంలో కొంతమంది విద్యార్థులు గత ఏడాది అక్టోబర్‌లో ఏసిబి డిఎస్పీ భాస్కరరావుకు ఫిర్యాదు చేసారు.

దీంతో ఆయన ఇన్‌స్పెక్టర్లు కృపానందం, వెంకటేశ్వర్లు, చంద్రమౌళిలతో కలిసి ఐటిఐపై దాడి చేసారు. ఆ సమయంలో కాంట్రాక్టు ఉద్యోగి కిరణ్ కుమార్, ఏటిఓ శైలజ, రవి అనే ఉద్యోగి నుంచి భారీగా నగదును స్వాధీనం చేసుకుని వారిని విచారించారు. విచారణలో ప్రిన్సిపల్ ఎస్‌కె కరీముల్లా, శిక్షణాధికారి ఎస్.మస్తాన్, సహాయ శిక్షణాధికారి ఎ.శైలజ అక్రమ వసూళ్ళకు పాల్పడినట్లు నిర్ధారించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసారు.

### ఎల్ఐసి ఉద్యోగుల

# కొవ్వొత్తుల ప్రదర్శన

నెల్లూరు, గాంధీబొమ్మ సెంటర్ వద్ద బీమా సంస్కరణ బిల్లుకు వ్యతిరేకంగా ఎల్ఐసి ఉద్యోగులు ఈ నెల 19వ తేది కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఐసిఇయు అధ్యక్షులు డి.ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని, అందులో భాగంగా బీమా సంస్కరణ బిల్లును తెచ్చేందుకు చర్యలు తీసుకుం టుందన్నారు. 63 ఏళ్ళ ఎల్ఐసి ప్రస్థానంలో లక్ష్యాలను సాధించడంలో ఎప్పుడూ ముందంజలోనే ఉందన్నారు. గత ఏడాది రూ.3.67 కోట్ల పాలసీలతో 73.02 శాతం మార్కెట్ లీడర్‌గా నిలిచిందన్నారు. పాలసీలకు సంబంధించిన మొత్తాలు కలిపి రూ.49.642 కోట్లు చెల్లించిందన్నారు.

ఈ బిల్లు ద్వారా బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 26 శాతం నుంచి 49 శాతానికి పెంచే ప్రయత్నం జరుగుతుందని, సాధారణ బీమా రంగంలోని 4 కంపెనీలలో ప్రభుత్వ వాటాల ఉపసంహరణ చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని, దీనివల్ల ప్రజల పొదుపుకు భద్రత ఉండదని, ఆర్థిక రంగానికి మూలస్థంభాలైన ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు బలహీనమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఐ ఛైర్మన్ డాక్టర్ యంపి రమణయ్య, ఐసిఇయు నాయకులు ఎస్.జగదీశ్వరి, జిఎస్ మధుసూదన్, పివి సుందరబాబు, ఎల్ఐసి బ్రాంచ్ ఉద్యోగులు, డివిజన్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఘరానా దొంగలు అరెస్ట్

## రూ.4 లక్షల సొత్తు స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ డిఎస్పీ వియస్ రాంబాబు

నెల్లూరు జిల్లాలో పలు ప్రాంతాల్లోను, దేవాలయలు, ఇళ్లలో దొంగత నాలకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా దొంగలను కోవూరు పోలీసులు ఈ నెల 18వ తేది అరెస్టు చేసారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరురూరల్ డిఎస్పీ వీఎస్ రాంబాబు కోవూరు పోలీసుస్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు.

నెల్లూరు జిల్లా విడవలూరు మండలం శంభునిపాలెంకు చెందిన తంబి సతీష్, నరేష్ సోదరులు. వీళ్ళు గత కొన్నేళ్ళుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలకు అలవాటుపడ్డారు. విడవలూరులోని శివాలయం పూజారి ఇంట్లో, ఆ గ్రామంలోని పెనుకొండమ్మ ఆలయంలో బంగారు నగలు దొంగిలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బంగారు నగలు, మోటారు సైకిళ్ళను చోరీ చేస్తూ జల్సాలు చేసుకునేవారు. వీరిపై నిఘా ఉంచిన ఐడి పార్టీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని తమదైన స్టైల్లో విచారించారు. వారి వద్ద నుంచి 32 గ్రాముల బంగారం, ఆరు మోటారు సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఐడి పార్టీ పోలీసు లను, కోవూరు సిఐని, డిఎస్పీ అభినందించారు.

ఈ సమావేశంలో కోవూరు సిఐ మాణిక్యరావు, విడవలూరు ఎస్సై అమీర్‌జాన్, ఐడి పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

### మేషం



అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులు రాకుండా మెలకువగా నిర్వహిస్తారు. కొత్త పెట్టుబడులు, కొత్త వ్యాపారాలకు అవకాశాలు లభించగలవు. అనుకున్న పనులకు ఆటంకాలుండినా జరుగుతాయి, అయితే టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. అవసరాలకు ఋణాలు చేయవలసి రావచ్చును. ఉద్యోగులకు అధికారుల సహకారము, ఆదరణ ఉంటుంది. సభ, సమావేశాలలో పాల్గొంటారు.

### వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష 1, 2పాదాలు

వృత్తి నిర్వహణలో తీరిక ఉండదు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలుండి ఆదాయం పెరుగుతుంది. పలుబడికి, గౌరవమర్యాదలకు ఖర్చులు చేస్తారు. అనుకున్న పనులను సాధిస్తారు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. దూర ప్రయాణాలు నిర్ణయంకాగలవు. మీ సూచనలు, సలహాలను ఇతరులు ఆమోదించడం జరుగుతుంది.

### మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తుల క్రయవిక్రయాలు, క్రొత్త పెట్టుబడులకు అవకాశాలు లభిస్తాయి. వ్యాపార వర్గాలకు పోటీ బాగుంటుంది, అందుచే అవకాశాలు ఆదాయం తగ్గవచ్చును. కోర్టు వ్యవహారాలు ఇబ్బందిని కలిగించగలవు. అనుకున్న పనులు ఆలస్యంకాగలవు. వివాహాది శుభకార్యాలు నిర్ణయంకావడం, దూరప్రయాణాలు జరుగుతాయి. ఉద్యోగులకు అధికారుల నుండి వత్తిడి ఎక్కువగా ఉంటుంది.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలు బాగుంటాయి. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది, కాని ఖర్చులు కూడా పెరుగుతాయి. సోదరుల సహకారముతో ముఖ్య విషయాలు ఒక కొలిక్కివస్తాయి. స్థిరాస్తులు ఏర్పరుచుకొనే ప్రయత్నాలలో సంప్రదింపులు జరుపుతారు. అనుకున్న సొంత పనులు, ప్రభుత్వ అనుమతులు ఆలస్యంకాగలవు. బిల్డర్స్‌కు, కాంట్రాక్టర్లకు సమస్యలు అధికము. ఆహ్వానాలు అందుతాయి.



బ్రహ్మశ్రీ

## స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 24.01.2014 నుండి తేది. 30.01.2014 వరకు

ఈ వారం మేషంలో కేతువు, మిథునంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శని రాహువులు, ధనుస్సులో శుక్రుడు, మకరంలో రవి బుధులు, తుల వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము

తేది ఆదివారం గణతంతర దినోత్సవము.

### ముహూర్తములు

ముహూర్తాలు లేవు.

### పుష్యమాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 24 | శుక్ర | అష్టమి | సాం॥గం.5.26వ॥ |
| తేది. 25 | శని | నవమి | సాం॥గం.04.21వ॥ |
| తేది. 26 | ఆది | దశమి | ప॥గం.02.54వ॥ |
| తేది. 27 | సోమ | ఏకాదశి | మ॥గం.01.08వ॥ |
| తేది. 28 | మంగళ | ద్వాదశి | మ॥గం.11.06వ॥ |
| తేది. 29 | బుధ | త్రయోదశి | ఉ॥గం.08.53వ॥ |
| | పిదప | చతుర్దశి | పూర్తిగ |
| తేది. 30 | గురు | అమావాస్య | రా॥గం.04.10వ॥ |

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆకస్మిక ఖర్చులు ఉంటాయి. వ్యాపార వర్గాలకు ఆదాయం తగ్గడం ఆర్థిక సమస్యలను సర్దుబాటు చేసుకొనాలి. వృత్తిపరంగా ప్రాపకం పెరుగుతుంది. శాస్త్ర సాంకేతిక కళాక్రీడా రంగాల వారికి అవకాశాలు లభించగలవు మరియు తమ పరిధిలో సామర్థ్యం చూపుతారు. అనుకున్న పనులు, ప్రభుత్వ అనుమతులు కొద్ది ఆలస్యం కాగలవు. స్థిరాస్తుల కొనుగోలు జరుపగలరు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వాహనాలు నడిపేవారు., యంత్రాలతో పనులు చేసేవారు జాగ్రత్తగాఉండాలి. సభ, సమావేశాలలో మీకు గుర్తింపు, గౌరవాలు బాగుంటాయి. ఆదాయం పెరుగుతుంది. కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. కోర్టు కేసులందు అనుకూలత ఉంటుంది. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి. ఉద్యోగులకు బాధ్యతల మార్పులు, పనిభారం ఉంటుంది.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక వ్యవహారాలు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. అయినా అవసరాలకు డబ్బు చేతికందివచ్చి పనులు జరుగుతాయి. కాంట్రాక్టర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మిల్లు యజమానులకు ప్రభుత్వ ఇబ్బందులుంటాయి. టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ముఖ్యవ్యవహారాలలో సంప్రదింపులు జరిపి, నిర్ణయాలు తీసుకోనండి. వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయముంటుంది.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక కార్యక్రమాలను జాగ్రత్తగా నిర్వహించండి. పెట్టుబడులందు అవకాశాలు, కొత్త వ్యాపారాలకు ప్రోత్సాహం ఉంటుంది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. పలుకుబడి పెంచుకొనేందుకు ఖర్చులు పెడతారు. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. ఉద్యోగులు అధికారులతోను, ప్రజలతోను జాగ్రత్తగా మెలగండి. హామీలు, మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండండి.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆలోచనలకు అనుగుణంగా పనులు చేపట్టి విజయవంతంగా నడుపుతారు. వృత్తి వ్యాపార వర్గాలకు మంచి ఆర్థికావకాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. మీ సూచనలు, సలహాల వల్ల ఇతరులు ప్రయోజనం పొందుతారు. విమర్శలకు దీటుగా స్పందిస్తారు. శాస్త్ర సాంకేతిక రంగాల వారికి ప్రభుత్వ సహకారముంటుంది. స్థిరాస్తులు, విలువైన వస్తువులు కొనడం జరుగుతుంది.


### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి ఉపాధి పథకాలను నిలద్రొక్కుకుంటారు. వ్యాపారవృద్ధికి నూతన పెట్టుబడులకు వనరులు సమకూరుతాయి. ఆదాయం పెరుగుతుంది. రాజకీయ వర్గాల ప్రయత్నాలకు ఆటంకాలు కలుగవచ్చును. కోర్టు వ్యవహారాలలో కొంత ఉపశమనం ఉంటుంది. బాకీలు, ఇతరత్రా రావలసిన డబ్బు అందుకొనగలరు. గృహ మార్పులు, స్థానమార్పులు, వస్తు, వాహన రిపేర్లు జరుగగలవు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పెట్టుబడుల విషయంలో సిర్థాస్తుల లావాదేవీల విషయంలో ఆచితూచి వ్యవహరించండి. ప్రభుత్వ అనుమతులు, ఆలస్యంకాగలవు. వారం మధ్యలో కొద్ది ఆందోళన ఉంటుంది. రాజకీయ వర్గాలకు ఎటు పాలుబోని స్థితి ఉంటుంది. కోర్టు వ్యవహారాలు ఇబ్బంది పెట్టగలవు. బాకీలు వసూళ్ళు నిలబడిపోతాయి. అదనపు ఖర్చులు హటాత్తుగా పైన బడగలవు.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కొన్ని నిర్ణయాలు సాహసవంతంగా చేస్తారు మరియు ప్రయోజనం పొందుతారు. స్థిరాస్తులు ఏర్పరచుకొనడం, చెల్లింపులు, బాకీలు తీర్చడం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి అవకాశాలు దొరుకుతాయి మరియు ఆదాయం బాగుంటుంది. అవగాహన లేని విషయాలు వదలండి. రాజకీయ వర్గాలకు ఇతర అవకాశాలు దొరుకుతాయి. దూరప్రయాణాలుంటాయి.

# స్వామి వివేకానంద యువజన వారోత్సవాలు



బుజబుజనెల్లూరులోని శ్రీనివాస ఇంగ్లీషు మీడియం స్కూలులో ఇటీవల పినాకిని యూత్ అసోసియేషన్ జిల్లా యువజన సర్వీసులశాఖ(సెట్నెల్) సంయుక్త నిర్వ హణలో స్వామివివేకానంద యువజన వారోత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత వాణిజ్య పన్నులశాఖ సహాయ కమీషనర్ టంగు టూరు మహబూబ్ మాట్లాడుతూ యదార్థమైన మనిషిగా రూపొందడానికి అవసరమైన విచక్షణా జ్ఞానం, సమాజ శ్రేయస్సు కోసం కావలసిన చైతన్యాన్ని అందించే తత్వమూ, మతమూ నేడు అవసరం అంటూ స్వామి వివేకానంద శతాబ్దం క్రితం చేసిన బోధనలు, ఆలోచనలు నేటికీ ఆదరణ పొందుతున్నాయని పేర్కొన్నారు. మరొక అతిథి వాస్తు రామచంద్ర మాట్లాడుతూ ప్రపంచానికి భారతదేశపు గొప్పతనాన్ని, విశిష్టతను దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పిన సంస్కృతీ పరిరక్షకుడు స్వామి వివేకానంద అని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఛైర్స్ పోటీలలో విజేతలకు బహుమతులందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, ఉపాధ్యక్షుడు రవిగోగుపల్లి, కోశాధికారి యస్.ప్రభాకర్‌రాజు, స్కూలు కరస్పాండెంట్ యన్.వి.సుబ్బయ్య, సభ్యులు అశోక్, అల్తాఫ్ పాల్గొన్నారు.

### సత్ఫలితాల కోసం

# 60రోజుల ప్రణాళిక

పదో తరగతి వార్షిక పరీక్షలకు రెండు నెలల సమయం మాత్రమే వుండడంతో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సత్ఫలితాల కోసం విద్యార్థులను సమాయత్తం చేయడంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తమ శక్తిమేర కృషిచేస్తున్నారు. ఈనెల 20న నెల్లూరు సిఏఎం హైస్కూలు ప్రాంగణంలో జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం 60రోజుల ప్రణాళి కను ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వెలువరించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలన్నారు. ఈ 60రోజుల ప్రణాళిక ప్రకారం బోధన జరిగేలా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడూ కృషిచేయాలన్నారు.

# 'బాటసారి'

(మొదటిపేజీ తరువాయి)

అక్కినేని నాగేశ్వరరావు, ఎన్టీ రామారావు లాంటి మహానటులకు మరణంలేని జీవితం ప్రసాదించి చిరంజీవులుగా చేస్తే ఎంత బాగుణ్నోకదా అని ఈ జనం వెర్రి ఆశ, సూర్యచంద్రుల్లా నిలిచిపోవాలని కొండంత కోరిక. వారికున్న ప్రేక్షకాదరణ చూసి విధికి కన్నుకుట్టిందేమో అలాంటి వరం ప్రసాదించకుండా క్రూరంగా ప్రవర్తించింది. నటనిఘంటువుల్ని మన నుంచి దూరంచేసింది. అక్కినేని ఎక్కని ఎత్తుల్లేవు. ఆయన అధిరోహించని శిఖరాల్లేవు. ఆయన పొందని సత్కారాల్లేవు. కాగడాల వెలుతురులో పగడాలను కూర్చినవాడు. నాగేశ్వరుడైనా అందరి అనురాగేశ్వరుడైనాడు. అదే ఆయన ప్రత్యేకం.

ప్రేమకథా చిత్రాలను మకుటాయమానంచేసి నటనకు భాష్యం చెప్పిన గొప్ప నటుడాయన. 17సం॥ల ప్రాయంలో ప్రారంభమైన అక్కినేని నటప్రస్థానం నెల్లూరీయులైన ఘంటసాల బలరామయ్య చేతి చలువతో తొలి సినిమా ధర్మపత్ని నుండి సీతారామజననం మీదుగా సీతారామయ్యగారి మనుమరాలు, మనం వరకు నిరంతరాయంగా సాగింది. నటనే జీవితంగా ఆయన కోరిక ప్రకారం చనిపోయేంత వరకూ నటిస్తూనే మరణించిన పుణ్యశీలి, అత్యంత ప్రతిభాశాలి అక్కినేని.

నాగేశ్వరరావులోని స్వీయకఠోర క్రమశిక్షణ, నిబద్ధత, వృత్తిని అమితంగా ప్రేమించే తత్వం నటనపట్ల ఆయనకున్న అంకితభావం ఆయన్ను మహోన్నత స్థాయిలో నిలబెట్టాయి. ఆయన ఆహార్యంలో తెలుగుతనం, నిరాడంబరత్వం ఎంతో ఆదర్శనీయం. కేవలం నాల్గవ తరగతి వరకే చదివిన అక్కినేని నాగేశ్వరరావు అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడే స్థాయికి, ఎంతో వైవిధ్యంగా ఆలోచించి ఉన్నతమైనభావాలు ప్రవచించే స్థాయికి ఎదగడం వెనుక ఆయన అవిరళకృషి, చదువుపట్ల ఆయనకున్న ఆసక్తి జీవితం పట్ల ఏర్పరచుకొన్న అవగాహన మనకు అవగతమవుతుంది.

అక్కినేని ఆలోచనలు, నేనూ నా జీవితం, నేను చూసిన అమెరికా లాంటి పుస్తకాలు వ్రాయడం వెనక ఆయన చేసిన కృషి ద్యోతకమవుతుంది. అక్కినేని ఆలోచనలు ఆయనలోని సంస్కారగుణ ప్రతీకలుగా నిలిచిపోయాయి.

స్టెప్పులు, డాన్సులు సృష్టించిన విధాత అక్కినేని. ఆ సంస్కృతి ఆయన సృష్టించిందే. తెలుగు సినిమారంగంలో ఆయన తొలిసారిగా సృష్టించిన స్టెప్పుల కళను అన్ని భాషల్లోని నటులూ అనుకరించారు. ఎంతగానో ఆదరించారు. ఎందరో పాటించారు. అదో సంప్రదాయంగా సినిమాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

ఆంధ్రదేశానికేగాదు ఆయన యావత్ భారతావనికే ముద్దుబిడ్డ. నటసామ్రాట్ ఆయన పేరులో ఒక భాగమై నిలిచిపోతే పద్మశ్రీతో ప్రారంభమైన అవార్డుల పరంపర పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్‌ఫాల్కే, రఘుపతివెంకయ్య అవార్డు, ఎన్.టిఆర్.అవార్డులతో ఆయన నటనకు కీర్తికాంతులద్దింది. ఆయన కాళిదాసుగా పిలవబడ్డాడు. అన్నా అన్పించుకొన్నాడు. కళైమాణి అని ఆత్మీయంగా పిలిపించుకొన్నాడు.

రామాపురం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు వెళ్ళిన ఆ మహానటదిగ్గజం తెలుగువారి గుండెల్లో చెరగని ముద్రవేసారు. ఆయన తెలుగువారి తరగని ఆస్తి. మరణం ఆ మహనీయుణ్ణి ప్రజల నుంచి వేరు చేయలేదు ప్రజల గుండెల్లో 'ఎవరెస్టులా' నిల్చొని వెలుగుతూనే ఉంటారు. ప్రేమకథలు పండించి ఔరా అన్పించిన తీరు అనితర సాధ్యం తమిళంలో శివాజీగణేశన్ హిందీలో రాజ్‌కుమార్‌లాంటి నటులే ఆయన్ను అనుసరించిన సంఘటనలు కోకొల్లలు. మూగనోము, ప్రేమాభిషేకం, దసరాబుల్లోడు, బహుదూరపుబాటసారి, శ్రీమంతుడు లాంటి చిత్రాల్లో ఆయన నటన మకుటాయమానమై గుండెల్ని పిండేస్తుంది. నవలా నాయకుడిగా సెక్రెటరీ, విచిత్రబంధం, ప్రేమలూపెళ్ళిళ్ళు లాంటి చిత్రాల్లో ఆయన నటన శాశ్వతంగా మన గుండెల్లో నిలచిపోయింది. బుద్ధిమంతుడు, ధర్మదాతల్లో ద్విపాత్రాభినయం, ఇద్దరు మిత్రుల్లో మిత్రద్వయం పాత్రల్లో, నవరాత్రుల్లో బహుపాత్రాభినయం ఒక్క అక్కినేని వారికే చెల్లింది. దేవదాసు, ప్రేమ్‌నగర్‌లాంటి చిత్రాలు కళాఖండాలుగా సినీపరిశ్రమ ఉన్నంత వరకు అజరామరంగా నిలచిపోతాయి. ఆ చిత్రాల్లో ఆయన నటన పరాకాష్ఠగా నిలిచిపోయింది. సుడిగుండాలులాంటి ఆలోచనాత్మక, సందేశాత్మక చిత్రాల్లో నటించి నిర్మించిన అక్కినేని ధన్యజీవి. ఈ చిత్రంలో ఆయన నటనాకౌశలం చూసి మురిసిపోవలసిందే ఆయనలోని సమున్నత ఆశయాలకు అద్దంపట్టిందా చిత్రం.

మహాకవి కాళిదాసు, అమరశిల్పి జక్కన్న, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, రామదాసు, భక్తతుకారాం, మహాకవి క్షేత్రయ్య, మాయాబజార్‌లాంటి చారిత్రాత్మక, పౌరాణిక సినిమాల్లోనూ ఆయన ప్రతిభ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఎన్టీఆర్‌తో కలిసి గుండమ్మకథ చాణుక్య చంద్రగుప్తలాంటి చిత్రాల్లో కలిసి నటించి ఎంతగానో మెప్పించాడు. భార్యాబిడ్డలు, ఇద్దరమ్మాయిలు, బంగారుబాబు, ఆదర్శ కుటుంబంలాంటి కుటుంబచిత్రాల్లో నటించి మరింత ప్రేక్షకాదరణ పొందిన ఘనత ఆయనిదే. మేఘసందేశం, మరో మహోన్నత చిత్రరాజం. అటు అంజలీదేవితోను, ఇటు సావిత్రి నుంచి గత తరం నటీమణులు వాణిశ్రీ, జయసుధ, జయప్రద, జయలలిత, శ్రీదేవిలాంటి కథానాయికలతో నటించారాయన. శ్రీదేవి కూతురుతోను, వాణిశ్రీ కూతురితోను కథానాయకుడిగా నటిస్తానని చెప్పిన ఆత్మవిశ్వాసం అక్కినేని వారిది. వారి మాటల చాతుర్యానికి అబ్బురపడవలసిందే.

మనిషిలో స్వార్థం ఉండాలి, ఆ స్వార్థంలో విశ్వజనీనత ఉండాలని ఓ గొప్ప సందేశాన్ని బ్రతుకుబాటను చెప్పాడాయన. ఇలాంటి అక్కినేని ఆలోచనలు అందర్నీ ఆలోచింపజేస్తాయి, ఆకర్షిస్తాయి. ఆ మహానుభావుడి లోతైన పరిశీలనా ప్రతిబింబాలివి. ఆయనది గొప్ప ఆదర్శం. మరింత విలక్షణమైన గొప్ప వ్యక్తిత్వం!

తెలుగు చలన చిత్ర పరిశ్రమను మద్రాసు నుంచి హైదరాబాదుకు తరలించడంలో అక్కినేనిది ప్రముఖపాత్ర. తాను ముందుగా ఆచరించి ఎందరికో దారి చూపిన క్రియాశీలి ఆయన. అదే మనరాష్ట్ర ఖివృద్ధికి దోహదంచేసింది. చిత్రపరిశ్రమ తెలుగుగడ్డపై పరిఢవిల్లడానికి ఆయన వేసిన అడుగు ఆదర్శనీయమైంది.

అక్కినేని వారితో మాట్లాడుతుంటే మన ఆలోచనలు విహంగాలవుతాయి. ఆయన ఉపన్యాసం వింటుంటే ఎంతో ఉత్తేజం కల్గుతుంది. ఎన్నో కఠోరసత్యాలు తెలుస్తాయి. ఎలాంటి భేషజంలేని ఆయన ఉపన్యాస కళకు విస్తుపోవలసిందే?

ఆయన మంచి వ్యక్తేకాదు మంచివక్త కూడా! ఆయన సినిమాలు చూస్తుంటే తాదాత్మ్యం చెందుతాం. ఆయనెప్పుడు నటించడు, పాత్రల్లో జీవిస్తాడు ఆ మహనీయుని నటశైలికి శిరసు వంచి నమస్కరించాల్సిందే.

అంతటి మహానటుణ్ణి కోల్పోయి ఆంధ్రదేశం విషాదంలో మునిగిపోయింది. కోట్లాదిమంది అభిమానుల్ని వదలి తాను మాత్రం ఒంటరిగా వెళ్ళిపోయారు. ఇది తెలుగు వారికి అంతులేని విషాదం భారతీయులందరికీ బాధాకరం. ప్రపంచానికి రోజు దుర్దినం.

నెల్లూరుతో అక్కినేనికి వున్న అనుబంధం చిత్ర పరిశ్రమలోకి ఆయన ప్రవేశించిన రోజు నుంచే మొదలైందని చెప్పవచ్చు. నెల్లూరుకు చెందిన సినీదర్శకులు ఘంటసాల బలరామయ్య తీసిన 'సీతారామ జననం'లో అక్కినేనికి తొలి అవకాశం ఇచ్చారు. తదుపరి ఆయన తీసిన ముగ్గురు మరాఠీలు, బాలరాజు, శ్రీలక్ష్మమ్మ కథ, స్వప్నసుందరి చిత్రాల్లో అక్కినేని నటించారు. అందుకే అక్కినేని ఘంటసాల బలరామయ్యను తండ్రితో సమానంగా భావించేవారు. అలాగే నెల్లూరీయులైన మాగుంట కుటుంబంతో అక్కినేనికి చిరకాల స్నేహబంధాలున్నాయి. మాగుంట సుబ్బరామిరెడ్డి కుమారుడు మాగుంట విజయకుమార్‌రెడ్డి వివాహానికి, సుబ్బరామిరెడ్డి మృతి చెందినప్పుడు అక్కినేని నెల్లూరుకు వచ్చి వారితో మమేకమయ్యారు. మాజీ రాష్ట్రముఖ్యమంత్రి, నెల్లూరీయులు బెజవాడ గోపాలరెడ్డి చేతులమీదుగానే అక్కినేని 'నటసామ్రాట్' అవార్డు అందుకున్నారు. 1971లో కొడవలూరు మండలం యల్లాయపాలెంలో 4రోజులు పాటు జరిగిన "రైతుకుటుంబం" చిత్రం షూటింగ్‌లో అక్కినేని పాల్గొన్నారు. 1975లో బెజవాడ గోపాలరెడ్డితో పాటు ఆయన నెల్లూరులోని రాధామాధవ్ థియేటర్ను ప్రారంభించారు. 1981లో రాఘవ సినీకాంప్లెక్స్‌లోని కల్యాణి హాల్లో ప్రదర్శించబడిన 'శ్రీవారి ముచ్చట్లు' చిత్రం 100రోజుల వేడుకల్లో, కిరణ్ థియేటర్లో ఏడాదికిపైగా ప్రదర్శించబడ్డ 'ప్రేమాభిషేకం' వజ్రోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పోలీస్ పెరేడు గ్రౌండులో జరిగిన ఈ వేడుకల్లో ఆయన సమఉజ్జీగా వున్న మహానటుడు ఎన్.టి.రామారావు ముఖ్య అతిథిగా పాల్గొనడం విశేషం. 2003లో అక్కినేనికి మాజీరాష్ట్రముఖ్యమంత్రి నెల్లూరీయులు దివంగత బెజవాడ గోపాలరెడ్డి అవార్డును అక్కినేనికి నెల్లూరులో ప్రదానం చేయడం జరిగింది.

మొన్నీ మధ్య తిక్కవరపు సుబ్బరామిరెడ్డి ఆహ్వానం మేరకు నెల్లూరుకు వచ్చిన అక్కినేని నవ్వుతూ ఆహ్లాదంగా కన్పించారు. మన రూరల్ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి నేను అక్కినేని అభిమానినని ప్రకటిస్తే ఎంతో ఆనందంగా నవ్వారు. ఆ నవ్వు చెరిగిపోకముందే మనకీ దిగ్భ్రమ కల్గించే విషాద వార్త. ప్చ్!

# గండమే

(మొదటిపేజీ తరువాయి)

మిగిలిపోతుంది. ఈ వారంరోజుల్లో ఒరిగేదేమీ లేదు. ఓటింగ్ ద్వారా అసెంబ్లీ, మండలిలో బిల్లును తిరస్కరించవచ్చు. కాని ఇక్కడితో ఆగిపోయేదేమీ లేదు. బిల్లు భవిష్యత్‌ను నిర్ణయించాల్సింది పార్లమెంటే! విభజన బిల్లుపై పార్లమెంటు ఉభయసభలలో గందరగోళం చెలరేగడం ఖాయం. కాంగ్రెస్, బీజేపీలు మద్దతిస్తున్నా ఎస్పీ, ఆర్జేడీ వంటి పార్టీల గోలతో ఎన్నో ఏళ్ళుగా మహిళా బిల్లు అటకెక్కింది. రేపు విభజన బిల్లుపై కూడా పార్లమెంటులో అన్ని పార్టీలు కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని దాడిచేసే అవకాశముంది. దీంతో అసెంబ్లీ నుండి విభజన గందరగోళం పార్లమెంటుకు బదిలీ కానుంది.

# జిల్లా ప్రజావాకర్స్ ముగ్గుల పోటీలు



జిల్లా ప్రజావాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న నెల్లూరు దర్గామిట్టలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో ఉదయం 8గం॥లకు ప్రారంభమై మధ్యాహ్నం 1గం॥ వరకు ముగ్గుల పోటీలు జరిగాయి. బాలభవన్ డైరెక్టర్ శ్రీమతి సుభద్రాదేవి, వనిత పత్రిక సంపాదకులు వినియోగదారుల ఫోరం అధ్యక్షులు స్వరాజ్యలక్ష్మి, బి.ఆర్.సింధు, న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వెలంచర్ల భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.500/-, రూ.400/-, రూ.300/- యమ్.రంజని, యన్.జయ, యన్.పుష్పలు అందుకున్నారు. పోటీలో పాల్గొన్న వారందరికి కన్సోలేషన్ బహుమతులు మిగిలిన 33మందికి ఒక్కొక్కరికి 50రూపాయలు చొప్పున నగదు పంపిణీ చేసారు.

సభలో ఐ.యన్.జి లైఫ్ ఇండియా మేనేజర్ ప్రసాదరావు వంటకాల పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మందువ శ్రీనివాసరావు, మధురకవి బిరుదవోలు రామిరెడ్డి ఉపన్యసించారు. జాయింట్ సెక్రెటరీ జె.యస్.ఆర్. ఆంజనేయులు, శ్రీధర్, సత్యనారాయణ, మెట్టు సుధాకర్‌రెడ్డి, చెన్నయ్య, నాగేశ్వరరావు, రమేష్, నారాయణసింగ్, యమ్.వి.నారాయణరెడ్డి, వి.యస్.ప్రసాద్, వాసుదేవయ్య, పెంచలనరసయ్య, ఎం.వి.కృష్ణయ్య పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆర్థికసాయం



గూడూరు రెడ్ స్వచ్ఛంద సంస్థ ఊటుకూరు గ్రామానికి చెందిన పేద విద్యార్థి సర్వేపల్లి శ్రీకాంత్‌కు ఎంసీఏ చదువు నిమిత్తం 4500రూ॥లు ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఈ మొత్తాన్ని రోడ్లు భవనశాఖ అతిథిగృహంలో అధ్యక్షుడు జానా సుధీర్, కోశాధికారి రాజ్ పురోహిత్ రాజేష్ అందజేశారు. హైదరాబాద్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న ఏకొల్లు మల్లిఖార్జునకు 10వేల నగదు సాయాన్ని ఏఆర్డీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బషీర్ తన కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రహాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో...

# కరెన్సీ నోట్లు వెదజల్లితేనే వైద్యసేవలు



బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు ఎ.కె.జయరాజ్, ప్రధాన కార్యదర్శి బందారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ నెల 22న నెల్లూరు సంతపేట నుంచి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డియంహెచ్ఓ) కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు మెరుగైన వైద్యసేవలందించడంలో ఘోరంగా వైఫల్యం చెందారని, పేద ప్రజల ప్రాణాలు కాపాడడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నరని వారు ఆరోపించారు. వైద్యశాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతి ఏటా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మంజూరు చేస్తున్న నిధులను ఆ సంఘ సభ్యులు, వైద్యధికారులు కుమ్మక్కై స్వాహా చేస్తున్నారన్నారు. జననీ సురక్ష యోజన డబ్బులుకూడా లబ్దిదారులకు ఇవ్వకుండా మింగేస్తున్నారని విమర్శించారు. అక్రమార్కులకు అండదండలు అందిస్తున్న డిఎంహెచ్ఓపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కరెన్సీ నోట్లు వెదజల్లితేనే వైద్యసేవలు అందే పరిస్థితి వుందన్నారు. కార్యక్రమంలో దళితమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మొద్దు శ్రీనివాసులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# బిల్లుకు చిల్లు

(మొదటిపేజీ తరువాయి)

మద్దతునిచ్చే అవకాశం వుంది. భవిష్యత్‌లో ఈ రెండు పార్టీల మద్దతు పొందాలంటే రేపటి ఎన్నికల్లో తెలుగుదేశంతో పొత్తు ఉండకూడదు. ఆ పార్టీతో పొత్తు వల్ల పెద్దగా సీట్లొచ్చే పరిస్థితి లేదని బీజేపీ నాయకత్వం గ్రహించింది. సొంతంగా ఓటు బ్యాంకును పెంచుకోవడానికి ఒంటరిగా పోటీ చేయడమే మేలని బీజేపీ రాష్ట్ర నాయకుల ఉద్దేశ్యం. అందుకే టీడీపీతో పొత్తును ఖరారు చేయడం లేదు. ఈ వ్యూహం అమలు జరగాలంటే పార్లమెంటులో విభజన బిల్లుకు బ్రేకు పడాలి. ఈ విషయమే బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలలో స్పష్టమైంది. సీమాంధ్ర సమస్యల పరిష్కారానికి తమ పార్టీ కట్టుబడి ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. సవరణల ఆమోదానికి పట్టుబడతామన్నారు. తెలంగాణకు తాము కట్టుబడ్డామని చెబుతూనే సీమాంధ్ర సమస్యలపై ఆ పార్టీ దృష్టి పెట్టబోతుంది. తద్వారా పార్లమెంటులో బిల్లు ఆగిపోతే కాంగ్రెస్ రెండు ప్రాంతాల్లోనూ విలన్‌గా మారుతుంది. ఈ పార్లమెంటు సమావేశాలలో కాకపోయినా తాము అధికారంలోకి రాగానే శాంతియుత వాతావరణంలో తెలంగాణ ఏర్పాటు చేస్తామని రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. అప్పుడు తెలంగాణ ఏర్పాటు చేసిన క్రెడిట్‌తో పాటు సీమాంధ్రకు న్యాయం చేసిన ఖ్యాతి కూడా బీజేపీకే దక్కుతుంది. ఇలా జరగాలంటే పార్లమెంటులో బిల్లు ఆగిపోవాలి. విభజనపై కాంగ్రెస్ అనుసరిస్తున్న తీరు దారుణంగా ఉందని రాజ్‌నాథ్‌సింగ్ విమర్శించారు. మరి ఇలాంటి దారుణాన్ని బీజేపీ ఆమోదిస్తే అంతకంటే దారుణముంటుందా?



# తెలుగుతెర ముద్దుబిడ్డకు కన్నీటి నివాళి

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఇది ఓ తుఫాన్... ఓ భూకంపం. సునామీ వంటి ప్రళయం. తెలుగు సినీపరిశ్రమకు ఎన్టీఆర్, ఏఎన్ఆర్ రెండు కళ్ళు అయితే, ఆ రెండు కళ్ళు శాశ్వతంగా మూతపడ్డాయి. 1994 జనవరి 18న మొదటికన్ను ఎన్టీఆర్ కన్నుమూయగా, సరిగ్గా 20ఏళ్ల తర్వాత 2014 జనవరి 22న రెండోకన్ను ఏఎన్ఆర్ కన్నుమూసారు. ఏ భాషారంగ సినీప్రముఖులైనా ఆదర్శంగా తీసుకోగలిగినటువంటి మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు మృతితో తెలుగుసినీపరిశ్రమ దిగ్భ్రాంతికి గురైంది. చివరిసారి ఆ తెలుగుతెర ఇలవేల్పును చూసి నివాళు లర్పించడానికి తెలుగు, తమిళ, హిందీ, మళయాళ సినీపరిశ్రమల నట, సాంకేతిక లోకమంతా తరలివచ్చింది. హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ఆయన భౌతికకాయాన్ని చివరిసారిగా చూడడానికి లక్షలసంఖ్యలో అభిమానులు పోటెత్తినట్లు వచ్చారు. హీరోలు, హీరోయిన్లు, కామెడీ ఆర్టిస్టులు, ఇతర నటులు, దర్శకులు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు ఇలా ఒక్కరేమిటి... అటు రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు వేలసంఖ్యలో తరలివచ్చి ఈ బహుదూరపు బాటసారికి కన్నీటి నివాళులర్పించారు.



## మూ'వీ'క్షణం



### బాహుబలి సెట్‌లో ఆస్కార్ విజేత

100కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్న 'బాహుబలి' సినిమా షూటింగ్‌కు ఇటీవల ఆశ్చర్యకరంగా ప్రముఖ ఫ్రెంచ్ డైరక్టర్, ఆస్కార్ విన్నర్ క్లార్డ్ లేలౌచ్ విచ్చేసారు. ఇప్పటివరకు ఆయన 50 సినిమాలకు దర్శకత్వం వహించారు. ఆయన్ను చూసి 'బాహుబలి' టీం సంతోషపడింది.



### కల నిజమైంది!

తన కల ఫలించిందని శ్రద్దాదాస్ సంబరపడిపోతుంది. ఇటీవల బెంగాలీ సినిమా 'రాయల్ బెంగాల్‌టైగర్' సినిమాలో నటించడానికి కలకత్తా వెళ్లిన ఈ భామ అక్కడ 'దాదాగిరి' కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న సౌరభ్‌గంగూలీని కలిసింది. అక్కడ గంగూలీని చూసిన శ్రద్దాదాస్ ఆయన్ను కలవడం తన అదృష్టంగా చెప్పుకుంది.



### మాజీమోడల్‌గా మంచు

విలక్షణ నటి మంచు లక్ష్మి 'చందమామ కథలు' సినిమాలో ఓ కీలకపాత్ర పోషిస్తుంది. మాజీసూపర్ మోడల్ అయిన లిసాస్మిత్ పాత్రలో ఆమె కనువిందు చేయబోతుంది. ఈ పాత్రలో చాలా షేడ్స్ వుంటాయని, పాత్రపరంగా ఆమె ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటుంది.

## గూడూరు డివిజన్ వార్తలు

### కనీవినీ ఎరుగని రీతిలో...

# కోదండ రాముని తెప్పోత్సవం



వైభవంగా జరిగిన స్వామివారి తెప్పోత్సవ వేడుక

గూడూరులో కనీవినీ ఎరుగని రీతిలో ఈనెల 16వతేదీ రాత్రి పట్టణ నడిబొడ్డున వెలసి వున్న శ్రీకోదండరాముని తెప్పోత్సవ వైభవం కన్నుల పండువగా నిర్వహించారు. కనుమూరు హరిశ్చంద్రారెడ్డి ఛారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో హరిశ్చంద్రా రెడ్డి తండ్రి జ్ఞాపకార్థం ఈ కోనేరును దాదాపు కోటిరూపాయల వ్యయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీనికి గత సంవత్సరం ఏప్రెల్ 8న ముఖ్య మంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి శంఖుస్థాపన చేయగా కోనేరు అభివృద్ధి పనులను ఆరునెలల వ్యవధిలో ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు ఛైర్మెన్ కొణిదల మునిగిరీష్ సభ్యులు పనులను దగ్గరుండి నిర్మించారు. పాతికేళ్లుగా ఈ కోనేరు ఆక్రమణల చెరలో ఉండగా కోనేరు నిర్మాణానికి హరిశ్చంద్రా రెడ్డి ఛారిటబుల్‌ట్రస్టు ముందుకు రావడంతో కోనేరు చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించి కోనేరు నిర్మించారు. ఈనేపథ్యంలో పౌర్ణమిని పురస్కరించుకొని తెప్పోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. దీనిని తిలకించేందుకు పట్టణ ప్రజలే కాకుండా సమీప ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కోనేరు ప్రాంతం కిక్కిరిసింది. ముందుగా తిరుమల తిరుపతి వేదపండితులు స్వామి వారికి విష్వక్సేన పూజ, అంకురార్పణ, హోమాదులు నిర్వహించి కల్యాణం అనంతరం స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన తెప్పలో ఉంచి కోనేరులో తొమ్మిది ప్రదక్షిణలు చేశారు. సర్వాంగ సుందరంగా భారీ విద్యుత్ దీపకాంతులతో బాణసంచా వేడుకలు మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారికి ఈ తెప్పోత్సవం నిర్వ హించారు.

హరిశ్చంద్రారెడ్డి కుటుంబ సభ్యులు ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం స్వామిని తెప్పలో ఉంచి ఊరేగించారు. కాగా అప్పటి గూడూరు సబ్‌కలెక్టర్ జె.నివాస్ కోనేరు అభివృద్ధి తెప్పోత్సవం తిలకించేందుకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై తెప్పోత్సవంలో పాల్గొన్నారు.

ఆయనతో పాటు తెప్పోత్సవంలో మున్సిపల్ కమీషనర్ జి.సి.సుశీలమ్మ, గ్రూప్ థియేటర్ల యజమాని చదలవాడ హరిప్రసాద్, కె.మునిగిరీష్, ట్రస్టు సభ్యులు అనిల్, నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యంలతో తహశీల్దార్ వై.మైత్రేయ, టౌన్ సిఐ కె.రవికుమార్, ఆలయ ఇవో తాతా శ్రీనివాసరావు పాల్గొన్నారు. 1,2పట్టణ ఎస్సైలు షేక్ షరీఫ్, సుధాకర్‌రావులు దగ్గరుండి చర్యలు చేపట్టారు.



ప్రత్యేకపూజలు చేస్తున్న హరిశ్చంద్రారెడ్డి కుటుంబసభ్యులు

# పల్స్‌పోలియో విజయవంతం



గడియారం స్తంభం వద్ద చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు

గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద ఏర్పాటుచేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే బల్లి దుర్గా ప్రసాద్‌రావు ప్రారంభించారు. రెండో పట్టణంలోని వాటర్‌ట్యాంకు వద్ద ఆర్డీవో మధుసూదన్‌రావు పోలియో చుక్కల మందు పంపిణీ ప్రారంభించారు. అలాగే సొసైటీ ప్రాంతంలో మున్సిపల్ కమీషనర్ జి.సుశీలమ్మ పాల్గొని పిల్లలకు చుక్కల మందు వేశారు. క్లస్టర్ పరిధిలోని పట్టణం, గూడూరు రూరల్, చిల్లకూరు, మనుబోలు, ఓజిలి మండలాల పరిధిలో 26,056 మంది చిన్నారులకు చుక్కల మందును వేయాల్సి ఉండగా ఇందుకుగాను 25, 677మందికి చుక్కల మందును పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. పుర పాలక సంఘ డి.ఇ సీతారామారావు, సునీతాసేవాసంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు తెలుగుదేశం నాయకులు బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# భూసమస్యలపై విచారించాలని ధర్నా



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎఐటియుసి సభ్యులు

భూసమస్యల పరిష్కారానికి నోచుకోక ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన వారు ఆర్డీవో మధుసూదనరావును కలసి తమ సమస్యలపై వినతులను సమర్పించారు. గూడూరు పట్టణ సమీపానున్న గాంధీనగర్‌లో ముస్లీం మైనార్టీలకు ఇచ్చిన ఇళ్ళస్థలాలు కబ్జాకు గురయ్యాయని, దీనిపై లోకాయుక్తను ఆశ్రయించినా నేటికి న్యాయం జరగలేదని ఆర్డీవో ఎదుట వాపోయారు. కాగా రెండో పట్టణంలో ఉన్న ఎస్‌కెఆర్ ప్రభుత్వ కళాశాలకు సంబంధించిన సర్వేనెంబరు 2027లోని కబ్జాకు గురైన భూములపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎఐటియుసి ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు.

# డ్రైవర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

సరిహద్దుల్లో దేశాన్ని రక్షించే సైనికుల మాదిరిగా ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చే డ్రైవరు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సహాయ కమీషనర్ వెహికల్ ఇన్స్‌స్పెక్టర్ రంగారావు అన్నారు. గూడూరు ఆర్టీసీ డిపో ఆవరణంలో సోమవారం 25వరోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. డిపో మేనేజర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రమాదాలను అరికడితే సంస్థకు కోట్లు ఆదాయం మిగిల్చిన వారవుతారని అన్నారు. కొన్ని సందర్భాలలో డ్రైవర్ క్షణాల్లో నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందన్నారు. డిపో మెకానికల్ ఇన్‌చార్జి విజయకుమార్, శేషయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటా బీజేపీ ప్రచార కార్యక్రమంతో నూతనోత్సాహం



పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరులో ఇంటింటా బీజేపీ కార్యక్రమాలతో నూతనోత్సాహం వెల్లివిరుస్తుందని జాతీయ సీనియర్ నాయకుడు ఆర్.రాజారామ్ అన్నారు. సోమవారం నాడు పట్టణంలోని ఆసుపత్రి రోడ్డు, బజారువీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటా బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లూరు చెంచురెడ్డి, కార్యదర్శి తాటిపర్తి రమేష్, ప్రధానకార్యదర్శి అల్లూరు భాస్కర్, రూరల్ ఇన్‌ఛార్జి విజయకుమార్, దళితమోర్చా ఇన్‌చార్జి రమణయ్య, బాలాజీ. రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బానిసబ్రతుకే బంగారమైతే...

# సొంత రాష్ట్రమెందుకు?

***దేశంలో కొందరు నాయకులు బానిసత్వానికి అలవాటుపడ్డారు. బానిసబ్రతుకులే వీరికి బాగుంటాయి. దొరలకు కాళ్లు ఒత్తుతూ బానిసల్లాగా బ్రతకడమే వీరికి హాయిగా ఉంటుంది. ఒకప్పుడు మహ్మదీయులు, ఆ తర్వాత ఆంగ్లేయులు... ఇలా గడిచిపోయాయి భారతీయుల బానిసత్వ జీవితాలు. ఒకరకంగా వాళ్లను వదిలించుకున్నామనేగాని ఇప్పుడు కూడా కొన్నిపార్టీలలో నాయకులు బానిసలుగానే చెలామణి అవుతున్నారు.***

స్వతంత్ర పాలనకంటే బానిస బ్రతుకులే బాగున్నాయని అసెంబ్లీలో కొందరు నాయకులు చెబుతుంటే... నిజంగా మనమింకా బానిసత్వపు వాసనల నుండి బయట పడలేదేమోననిపిస్తుంది. అసెంబ్లీ సాక్షిగా నిజాం నవాబును ఓ గొప్ప పరిపాలకుడిగా, ఆదర్శ వాదిగా, లౌకికవాదిగా కొందరు సభ్యులు వర్ణించిన తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. నిజాం నవాబు దురాగతాలు లోకానికి తెలియంది కాదు. తెలంగాణ ప్రజలను ఎలా పీల్చి పిప్పి చేసారో ఆ ప్రాంత రచయితలే మన కళ్లకు కట్టే విధంగా పుస్తకాల్లో వ్రాసారు.



రజాకర్ల అరాచకాలకు ఎన్ని వేలమంది చనిపోయారో, ఎంత మంది స్త్రీలు చెరచబడ్డారో లెక్కేలేదు. ఇక పెళ్లిళ్లకు, చావుకు, జుట్టు పెంచితే, గడ్డం తీస్తే... ఇలా రకరకాల పన్నులు వేసి ప్రజలను బాధించారు. ఉద్యోగాలు, ఇతర ప్రయోజనాల పరంగా చూస్తే మెజార్టీ సంఖ్యాకులైన హిందువులను చిన్నచూపు చూసారు. ఇక హైదరాబాద్ నగరంలో ఆయన కట్టించిన భవనాలు, కోటల సంగతా... అవన్నీ ప్రజాధనంతో కట్టించినవే! ప్రజాధనాన్ని లూటీ చేసి తన జల్సాలకు వాడుకున్న నిజాం ఎన్నడూ గొప్ప పరిపాలకుడు కాలేదు.

కాని అదేం ఖర్మోగాని తెలంగాణలోని టీఆర్ఎస్ నేతలకు మాత్రం నిజాం పాలనే కమ్మగా ఉన్నట్లుంది. నిజాం పాలనలో విధించిన పన్నులు, అడ్డం తిరిగిన వారిని నరకడం, కనపడిన స్త్రీలను చెరచడం వంటివే బాగున్నట్లున్నాయి. అందుకే ఆయనను కీర్తిస్తూ అలాంటి పరిపాలనను స్వాగతిస్తున్నారు. రెండు చెరువులు, నాలుగు భవనాలు కట్టించగానే నిజాం పరిపాలన బాగుంటే మరి హైదరాబాద్ రూపురేఖలను, తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని మార్చిన తెలుగు నాయకుల పరిపాలన ఇంకెంత బాగుండాలి. మరి నిజాం కంటే కూడా బ్రిటీష్‌వాళ్లు ఇంకా బాగా పరిపాలించారు. వారి హయాంలోనే ఆధునిక అభివృద్ధికి బాటలుపడ్డాయి. మరి వారి మీద పోరాడి వారిని దేశం నుండి వెళ్ల గొట్టడమెందుకు?

నిజాం హయాంలో తెలంగాణ అభివృద్ధి గోరంత. ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడ్డాకే తెలంగాణ నుదిటిరాత మారింది. బానిస వ్యవస్థ నుండి వారిని బయటేసింది. పట్వాడీ, పటేల్‌ల బానిస వ్యవస్థలను రద్దుచేసి తెలంగాణ ప్రజలకు విముక్తి కల్పించింది ఎన్టీఆర్. ఆయన సీమాంధ్రుడే! హైదరాబాద్‌కు ఆధునిక హంగులు తెచ్చి సైబర్ సిటీ సోకులద్దిన చంద్రబాబు సీమాంధ్రుడే! ప్రపంచ అగ్రశ్రేణి ఎయిర్‌పోర్టులకు తీసిపోని విధంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టును నిర్మించి, అంతర్జాతీయ ప్రమాణాలతో పి.వి.నరసింహారావు ఎక్స్‌ప్రెస్ హైవేకి రూపకల్పనచేసి, మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు బాటలు వేసిన వై.యస్.రాజశేఖరరెడ్డి సీమాంధ్రుడే! తెలంగాణలోని ప్రతిజిల్లాలో సాగునీటి పథకాలకు రూపశిల్పి ఆయనే! తెలంగాణ బాగుపడిందన్నా, అక్కడి ప్రజల జీవితాలలో మార్పు వచ్చిందన్నా వీరి పరిపాలనవల్లే! తెలంగాణ నుండి ముఖ్య మంత్రులుగా చేసిన వాళ్లు కూడా తెలంగాణ కోసం చేసిందేమీ లేదు. మరి మన పాలనకంటే నిజాం పాలనే గొప్పగా వుందంటున్న తెలంగాణ నేతలకు ఇక సొంత రాష్ట్రం ఎందుకు?




ఈ నెల 23వ తేదీన వెంకటగిరిలో నిర్మించిన కేంద్రీయవిద్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖామంత్రి ఎం.ఎం.పల్లంరాజు, తిరుపతి ఎంపి చింతా మోహన్, కాంగ్రెస్ నాయకులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తదితరులు

# అయ్యబాబో... ప్రైవేట్ బస్సా!




ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు వరుసగా ప్రమాదాలకు గురవుతుండడంతో ప్రయాణీకులు బెంబేలెత్తుతున్నారు. ప్రైవేట్ బస్సులెక్కాలంటేనే భయపడుతున్నారు. ప్రైవేట్ కంటే ఆర్టీసీ బస్సులలో ప్రయాణానికే మొగ్గు చూపుతున్నారు. బెంగుళూరు సమీపంలో జరిగిన రాజేష్ ట్రావెల్స్ ఓల్వోబస్సు దుర్ఘటనలో నెల్లూరుజిల్లాకు చెందిన 5మంది చనిపోవడం తెలిసిందే. ఈ దుర్ఘటనతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ఇటీవలకాలంలో పలుచోట్ల ప్రైవేట్‌బస్సులే ఎక్కువగా ప్రమాదాలకు గురయ్యాయి. వీటితో పోలిస్తే ఆర్టీసీబస్సులు కొంచెం భద్రంగా కనిపిస్తున్నాయి. నెల్లూరు నుండి హైదరాబాద్‌కు ప్రతిరోజూ ఎక్కువ సంఖ్యలో ప్రయాణీకులు పోతుంటారు. వీరిలో ఎక్కువ మంది రైళ్లకు ప్రాధాన్యతనిస్తుంటారు. రైళ్లలో రిజర్వేషన్ లేనివాళ్లు ప్రైవేట్ ట్రావెల్స్‌పై ఆధారపడుతుంటారు.

నెల్లూరు నుండి హైదరాబాద్‌కు ఆర్టీసీ ఓల్వోలు తక్కువ. సూపర్ లగ్జరీలకు స్టాపింగ్స్ ఎక్కువ. ప్రయాణ సమయం ఎక్కువగా వుంటుంది. అందుకని ప్రైవేట్‌ట్రావెల్స్‌పై ఆసక్తి చూపేవాళ్లు. కాని ప్రైవేట్ బస్సుల వరుస ప్రమాదాలతో భయపడి ప్రయాణీకులు ఆర్టీసీ బస్సుకేసి పరుగులు తీస్తున్నారు.





## మాతృదేవోభవ

ఆప్యాయతానురాగాలు పంచిన అమృతమూర్తి,
మా ఇంటి ఆరాధ్యదైవం, మా తల్లిగారైన
**శ్రీమతి సోమిరెడ్డి హైమావతమ్మ గారు**
తేది 15.01.2014న స్వర్గస్తులైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ....

శోకతప్త హృదయాలతో....

కుమారుడు - కోడలు: **సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతి**

కుమారుడు - కోడలు
లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి - ప్రశాంతి

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | మనుమరాండ్రు |
|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | శ్రుతి |
| సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | సింధు |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | నీలిమ |
| యల్లా సనత్‌రెడ్డి | షాలిని |
| కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | మాలిని |
| కేతిరెడ్డి శశధర్‌రెడ్డి | కీర్తి |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | స్నిగ్ధ |

| మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|
| యల్లా శర్వీన్ | యల్లా సంజన |
| కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| కేతిరెడ్డి బాబు | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| | సన్నారెడ్డి నిరుక్తలేఖ |


Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.